

అక్షరశక్తి

The Power of Pen

Evening Daily

సంపుటి: 20 | సంచిక: 337 | వరంగల్ | శనివారం, 17 అక్టోబర్ 2026 | పేజీలు: 07

ఎమ్మెల్సీ ఎన్నికల్లో గులాబీ జెండా ఎగరాలి

మళ్లీ కేసీఆర్ నాయకత్వంవైపే తెలంగాణ ప్రజలు

కాంగ్రెస్ మూడేళ్ల పాలనలో అభివృద్ధి శూన్యం

ప్రజా సమస్యలపై సమీక్షలేవీ..
కాంట్రాక్టులపైనే హడావుడి

ఓరుగల్లులో మంత్రులున్నా.. ఇన్‌చార్జి పెత్తనమే!

పట్టభద్రుల ఓటరు నమోదును ఉద్యమంలా చేపట్టాలి

ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి, మాజీ చీఫ్‌విప్ దాస్యం వినయ్‌భాస్కర్

4

కాంగ్రెస్ మూడేళ్ల పాలనలో తెలంగాణకు ఒరిగిందేమీ లేదని, ప్రజా సమస్యల పరిష్కారంపై ప్రభుత్వానికి చిత్తశుద్ధి కొరవడిందని బీఆర్ఎస్ నేతలు ధ్వజమెత్తారు. కాంట్రాక్టులపై సమీక్షలకు ఇచ్చే ప్రాధాన్యం ప్రజా సమస్యలపై ఎందుకు చూపడం లేదని ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి ప్రశ్నించారు. ఓరుగల్లుకు చెందిన మంత్రులున్నా ఇన్‌చార్జి మంత్రి పెత్తనమే సాగుతోందని విమర్శించారు. అణచివేతలు, కేసులను ఎదుర్కొంటూ ప్రజా సమస్యలపై పోరాడుతున్నామని మాజీ చీఫ్‌విప్ దాస్యం వినయ్‌భాస్కర్ స్పష్టం చేశారు. తెలంగాణ ప్రజలు మళ్లీ కేసీఆర్ నాయకత్వాన్ని కోరుకుంటున్నారని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు ఏనుగుల రాకేశ్‌రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. రాబోయే పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో పార్టీ అభ్యర్థి విజయమే లక్ష్యంగా నాయకులు, కార్యకర్తలు క్షేత్రస్థాయిలో పనిచేయాలని, అర్హులైన పట్టభద్రుల ఓటరు నమోదును ఉద్యమంలా చేపట్టాలని బాలసముద్రంలోని పార్టీ జిల్లా కార్యాలయంలో నిర్వహించిన వరంగల్ పశ్చిమ నియోజకవర్గ విస్తృతస్థాయి సమావేశంలో నేతలు పిలుపునిచ్చారు. *- అక్షరశక్తి, హన్మకొండ*







సద్దుల బతుకమ్మ శుభాకాంక్షలు

హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి

అక్షరశక్తి, హన్మకొండ : తెలంగాణ సంస్కృతి, సాంప్రదాయలకు ప్రతీక అయిన సద్దుల బతుకమ్మ పండుగను జిల్లా లోని మహిళలందరూ ఆనందోత్సాహాలతో నిర్వహించుకోవాలని జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆదివారం సద్దుల బతుకమ్మ పండుగను పురస్కరించుకుని జిల్లాలోని మహిళలందరికీ సద్దుల బతుకమ్మ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ప్రపంచంలోనే పూలను పూజించి, ప్రకృతిని ప్రేమించే గొప్ప పండుగ బతుకమ్మ అని, ఈ పండుగను ప్రజలందరూ ఆనందోత్సాహాలు, భక్తిశ్రద్ధలతో జరుపుకోవాలని కలెక్టర్ ఆకాంక్షించారు. ప్రకృతిని ఆరాధించే గొప్ప సంప్రదాయం మనదని పేర్కొన్నారు.

దసరా ఉత్సవాలకు ట్రాఫిక్ ఆంక్షలు



అక్టోబర్ 20 మధ్యాహ్నం 3 గంటల నుంచి 21వ తేదీ తెల్లవారుజాము 3 గంటల వరకు అమలు వరంగల్, ఉర్సు రంగాలీల మైదానంలో ఈ నెల 20న నిర్వహించే దసరా ఉత్సవాల సందర్భంగా ట్రైసిటీ పరిధిలో ట్రాఫిక్ ఆంక్షలు విధించినట్లు వరంగల్ పోలీస్ కమిషనర్ ఎన్. శ్వేత తెలిపారు. అక్టోబర్ 20వ తేదీ మధ్యాహ్నం 3 గంటల నుంచి 21వ తేదీ తెల్లవారుజాము 3 గంటల వరకు ఈ ఆంక్షలు అమల్లో ఉంటాయని పేర్కొన్నారు. *- అక్షరశక్తి, వరంగల్*

3

యువత ఆరోగ్యంపై దృష్టి పెట్టాలి



- క్రీడలను జీవితంలో భాగం చేసుకోవాలి
- మంత్రి శ్రీధర్‌బాబు
- ట్రై సిటీస్ హాఫ్ మారథాన్–2026

5

యువతలో క్రీడాస్ఫూర్తిని పెంపొందించడంతోపాటు ఆరోగ్యంపై అవగాహన కల్పించేందుకు ట్రై సిటీస్ హాఫ్ మారథాన్ నిర్వహించడం అభినందనీయమని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు అన్నారు. నాయిని విశాల్ ట్రస్ట్, క్రెడాయ్ వరంగల్ ఆధ్వర్యంలో నిర్వహించిన ట్రై సిటీస్ హాఫ్ మారథాన్–2026 రెండో ఎడిషన్‌లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని 5కే పరుగును జెండా ఊపి ప్రారంభించారు. వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి, వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు పాల్గొన్నారు. *- అక్షరశక్తి, హనుమకొండ*

పీఆర్టీయూ రాష్ట్ర సహ అధ్యక్షులుగా కూరపాటి సత్య ప్రకాశ్ రావు



అక్షరశక్తి, హనుమకొండ: పీఆర్టీయూ తెలంగాణా రాష్ట్ర సహఅధ్యక్షులుగా ఆంగ్ల ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న కూరపాటి సత్య ప్రకాశ్ రావు నియమితులయ్యారు. ఈ నెల 15,16 తేదీలలో నల్గొండలో జరిగిన పీఆర్టీయూ రాష్ట్ర 6వ, రాష్ట్ర కౌన్సిల్ సమావేశాలలో జరిగిన ఎన్నిక లలో ఆయనను రాష్ట్ర సహాధ్యక్షులుగా ఎన్నుకున్నారు. తన ఎన్నికకు సహకరించిన ఎమ్మెల్సీ శ్రీపాల్ రెడ్డి, రాష్ట్ర అధ్యక్షులు సుంకరి భిక్షం గౌడ్, ప్రధాన కార్యదర్శి భట్టాపురం మధుసూదన్ రెడ్డి గారలకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఉపాధ్యాయుల సమస్యల సాధనకు, సంఘ పటిష్టతకు శక్తి వంచన లేకుండా కృషి చేస్తానని తెలిపారు. తన నియామకం పట్ల హన్మ కొండ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పలీత శ్రీహరి, ఎడ్ల ఉపేందర్ రెడ్డి, ఉపాధ్యాయులు, స్నేహితులు, బంధువులు శుభాకాంక్షలు తెలిపారు. ప్రస్తుతం సత్య ప్రకాశ్ రావు పెద్దపల్లి జిల్లాలో పనిచేస్తున్నారు.

పాండవుల గుట్ట పూజారి రావుల నారాయణ ముదిరాజ్‌కు ఘన నివాళులు



అక్షరశక్తి, రేగొండ: భూపాలపల్లి జిల్లా రేగొండ మండలం రావులపల్లి గ్రామానికి చెందిన పాండవుల గుట్ట ప్రధాన పూజారి రావుల నారాయణ ముదిరాజ్ మొదటి వర్ధంతిని పురస్కరించుకుని ఆయనకు ఘనంగా నివాళులర్పించారు. పీఆర్ ముదిరాజ్ సేవా సమితి రాష్ట్ర సేవకులు దండు చిరంజీవి ముదిరాజ్ ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా నారాయణ ముదిరాజ్ చేసిన ఆధ్యాత్మిక, ధార్మిక సేవలను స్మరించుకున్నారు. పాండవులు వనవాసం చేసినట్లు ప్రసిద్ధి చెందిన పాండవుల గుట్ట ప్రాంతంలో రావుల నారాయణ ముదిరాజ్ ప్రధాన పూజారిగా ఎన్నో సంవత్సరాలపాటు సేవలందించారు. గుట్టకు వచ్చే భక్తులు, పర్యాటకులకు ఆ ప్రాంత విశిష్టత ను వివరిస్తూ, పాండవుల గొప్పతనాన్ని, వారి జీవిత చరిత్రకు సంబంధించిన విశేషాలను తెలియజేసేవారు. పాండవుల గుట్ట చారిత్రక, ఆధ్యాత్మిక ప్రాధాన్య తను సందర్శకులకు అర్థమయ్యేలా వివరించి, వారిలో ఆసక్తిని కలిగించేవారు. తన సేవల ద్వారా ఈ ప్రాంత విశిష్టతను పలువురికి పరిచయం చేయడంలో ఆయన కీలక పాత్ర పోషించారు. నారాయణ ముదిరాజ్ మరణించినప్పటికీ, పాండవుల గుట్టకు ఆయన అందించిన సేవలు చిరస్మరణీయమని ఈ సంద ర్భంగా పలువురు పేర్కొన్నారు. ఆయనతో ఉన్న అనుబంధాన్ని గుర్తుచేసుకుం టూ కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు భావోద్వేగానికి గురయ్యారు. ఈ కార్య క్రమంలో రావులపల్లి గ్రామానికి చెందిన ముదిరాజ్ కుల పెద్దలు రావుల రమేష్, సాంబయ్య, సమ్మయ్య, మనోహర్‌తో పాటు మిత్రులు లోకేశ్వర్, సూర్య, కిరణ్, నారాయణ కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు పాల్గొని ఆయనకు ఘనంగా నివాళులర్పించారు.

మహిళల స్వయం ఉపాధి కల్పనకు ప్రభుత్వం కృషి

- ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి
- 154 మంది మైనారిటీ మహిళలకు కుట్టు మిషన్లు పంపిణీ



అక్షరశక్తి, పరకాల : పరకాల పట్ట ణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాల యంలో పరకాల టౌన్, పరకాల, నడికూడ, ఆత్మకూర్, దామెర మండలాలకు చెందిన 154 మంది నిరుపేద మైనార్టీ మహిళలకు కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం ఇందిరా మహిళా శక్తి పథకం ద్వారా అందిస్తున్న కుట్టు మిషన్లను పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి పంపిణీ చేశారు. సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ...కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం మైనారిటీ మహిళల సంక్షేమం, ఆర్థిక అభివృద్ధి కోసం ఇందిరమ్మ మహిళ శక్తి పథకం ద్వారా కుట్టు మిషన్ల పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టిందని అన్నారు. ప్రతి ఒక్కరికి స్వయం ఉపాధి అవకాశాలు కల్పించడం లక్ష్యంగా ప్ర భుత్వం కృషి చేస్తోందని, కోటి మంది మహిళలను కోటీశ్వరులు చేయడమే తమ ప్రభుత్వ లక్ష్యం అన్నారు. ఆధునిక కుట్టు మిషన్లతో ట్రైనింగ్ ఇప్పించి కాకతీయ మెగా టెక్స్టైల్ పార్క్ లో ఉద్యోగ అవకాశాల కల్పన దిశగా కృషి చేస్తున్నామనీ, అలాగే బస్సు సౌకర్యం ఏర్పాటు చేస్తున్నామన్నారు. పరకాల పట్టణంలో ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి రెండు కోట్లతో షాదీఖానా పనులకు శంకుస్థాపన చేశారని అన్నారు. ఈ కార్యక్రమంలో డి ఆర్ డి ఓ మేన శ్రీను , మున్సిపల్ చైర్మన్ పావుశెట్టి సునీల్ తదితరులు పాల్గొన్నారు.

పర్యాటక నెలవు తెలంగాణ అడవులు

- తాడ్వాయి, వికారాబాద్, మున్ననూరు ప్రాంతాల్లో ప్రకృతి ఆధారిత పర్యాటకం
- నగరం విడిచి అడవి బాట పడుతున్న ప్రకృతి ప్రేమికులు









అక్షరశక్తి, హైదరాబాద్: సెలవుల్లో ప్రకృతి మధ్య కొంత సమయం గడపాలనుకునేవారికి తెలంగాణలోని అటవీ ప్రాంతాలు విభిన్న అనుభవాలను అందిస్తున్నాయి. అడవిలోని పక్షులను గమనించడం, ప్రకృతి నడకల్లో పాల్గొనడం, వృక్షజాలం, జంతుజాలం గురించి తె లుసుకోవడం వంటి కార్యక్రమాలు పర్యటనకు కొత్త కోణాన్ని జోడిస్తున్నాయి. తెలంగాణ అటవీ అభివృద్ధి సంస్థ (టీజీఎఫ్‌డీసీ) చేపడుతున్న ఎకోటూరిజం కార్య క్రమాలు అటవీ ప్రాంతాలను సందర్శించడంతో పాటు ప్రకృతి పట్ల అవగాహన పెంపొందించుకునే అవకా శాన్ని కల్పిస్తున్నాయి. ములుగు జిల్లాలోని తాడ్వాయి అటవీ ప్రాంతంలో పర్యాటకులు ప్రకృతి నిపుణుల సహాయంతో అడవిలోని మొక్కలు, పక్షులు, జంతువుల సంచార ఆనవాళ్ల గురించి తెలుసుకోవచ్చు. సఫారీతో పాటు ఉదయం సుమారు నాలుగు కిలోమీటర్ల అటవీ నడకలో పాల్గొనే అవకాశం ఉంది. ఈ కార్యక్రమాల ద్వారా అడవిలోని జీవవైవిధ్యాన్ని దగ్గరగా గమనిం చవచ్చు. తాడ్వాయిలోని ది జెయింట్ స్కిర్చల్ రిసార్ట్ టీజీఎఫ్‌డీసీ ఎకోటూరిజం కార్యక్రమంలో భాగంగా కొ నసాగుతోంది. వికారాబాద్‌లో ప్రకృతి పర్యటనకు మరో విధమైన అనుభవం ఎదురవుతుంది. పక్షుల పరిశీలన, ట్రెక్కింగ్ వంటి కార్యక్రమాల ద్వారా అక్కడి ప్రకృతి పరి సరాలను కాలినడకన అన్వేషించవచ్చు. ఉదయం బుష్ బ్రేక్‌ఫాస్ట్, సాయంత్రం సూర్యాస్తమయాన్ని వీక్షించే అవకాశం కూడా ఉంది.

నల్లమల అటవీ ప్రాంతంలోని మున్ననూరు జంగిల్ రిసార్ట్ సందర్శకులకు అమ్రాబాద్ టైగర్ రిజర్వ్ పరిసరాలను పరిచయం చేస్తుంది. పర్యావరణ విద్యా కేంద్రంలో అమ్రాబాద్ టైగర్ రిజర్వ్ గురించి అవగా హన పొందిన తర్వాత పర్యాటకులు జంగిల్ సఫారీకి వెళ్లవచ్చు. మార్గదర్శకులతో కలిసి చేసే అటవీ నడక ద్వారా ఆ ప్రాంతంలోని వృక్షజాలం, జంతుజాలం, పక్షుల గురించి అవగాహన పొందవచ్చు.

అటవీ పర్యటనలు కేవలం వినోదానికే పరిమితం కావు. అడవిలోని చెట్లు, మొక్కలు, కీటకాలు, పక్షులు, జంతువులు ఒకదానితో మరొకటి సంబంధం కలిగి ఉంటాయి. ఈ జీవవ్యవస్థను ప్రత్యక్షంగా గమనించ డం ద్వారా విద్యార్థులు, కుటుంబాలు, ప్రకృతి ప్రేమి కులు జీవవైవిధ్యం ప్రాధాన్యాన్ని అర్థం చేసుకోవచ్చు. సహజ ఆవాసాలను కాపాడుకోవాల్సిన అవసరంపై కూడా అవగాహన పెరుగుతుంది. అటవీ ప్రాంతాలను సందర్శించే సమయంలో పర్యాటకులు బాధ్యతాయు తంగా వ్యవహరించడం అవసరం. అటవీ సిబ్బంది, ప్రకృతి నిపుణుల సూచనలు పాటించడం, వన్యప్రా ణులకు ఇబ్బంది కలిగించకపోవడం, పరిసరాల్లో చెత్త వేయకుండా ఉండటం ద్వారా పర్యావరణ పరిరక్షణకు సహకరించవచ్చు.

తెలంగాణలోని అటవీ ప్రాంతాలను ప్రకృతి అనుభవా లకు వేదికలుగా పరిచయం చేయడంలో టీజీఎఫ్‌డీసీ ఎకోటూరిజం కార్యక్రమాలు ముఖ్యమైన పాత్ర పోషిస్తు న్నాయి. అడవిలో నడక, పక్షుల పరిశీలన, సఫారీ వంటి అనుభవాలు పర్యాటకులకు ప్రకృతిని కొత్త కోణంలో చూసే అవకాశాన్ని కల్పిస్తాయి.

బుకింగ్ చేసుకోండి....

టీజీఎఫ్‌డీసీ ఎకోటూరిజం ప్రదేశాలు, అందుబాటులో ఉన్న ప్యాకేజీల వివరాలు తెలుసుకోవడానికి, బుకింగ్ చేసుకోవడానికి Deccan Woods & Trails అధికా రిక వెబ్‌సైట్‌ను సందర్శించవచ్చు.

రిటైర్డ్ ఆర్మీ కోచ్ ఆవుల కమల్‌కు ఇంటర్నేషనల్ బుక్ ఆఫ్ రికార్డ్స్ అవార్డు

అక్షరశక్తి,హనుమకొండ: రిటైర్డ్ ఆర్మీ కోచ్ ఆవుల కమల్‌కు ప్రతిష్టాత్మక ఇంటర్నేషనల్ బుక్ ఆఫ్ రికార్డ్స్ అవార్డు లభించింది. భారత సైన్యంలో సేవలందించిన అనంతరం యువతకు మార్గదర్శకంగా నిలుస్తూ, ఆర్మీ, నేవీ, పోలీస్ కానిస్టేబుల్ వంటి ఉద్యోగాలను సాధించాలనే లక్ష్యంతో ముందుకు సాగుతున్న అభ్య ర్థులకు ఫిజికల్ కోచింగ్ అందిస్తున్న ఆయనకు ఈ అవార్డు దక్కింది. దేశ రక్షణలో భారత సైనికుల పాత్ర ఎంత కీలకమో, దేశానికి సేవ చేయాలనే లక్ష్యంతో యువతను తీర్చిదిద్దే శిక్షకుల పాత్ర కూడా అంతే ముఖ్యమైనది. సైన్యంలో పనిచేసిన తన అనుభవాన్ని యువతకు అందిస్తూ, వారిలో క్రమశిక్షణ, పట్టుదల, శారీరక దృఢత్వం, ఆత్మవిశ్వాసం వంటి లక్షణాలను పెంపొందించడంలో ఆవుల కమల్ తనదైన పాత్ర పోషిస్తున్నారు. నేటి పోటీ ప్రపంచంలో రక్షణ రంగం, పోలీస్ శాఖలో ఉద్యోగాలు సాధించాలంటే అభ్యర్థుల కు శారీరక సామర్థ్యంతో పాటు మానసిక దృఢత్వం, నిరంతర సాధన, సమయపాలన ఎంతో అవసరం. ఈ అంశాలను దృష్టిలో ఉంచుకుని అభ్యర్థులకు శిక్షణ అందిస్తూ, వారు తమ లక్ష్యాలను చేరుకునే దిశగా కృషి చేస్తున్నారు. యువతలో దేశభక్తి భావనను, కష్టపడి సా ధించాలనే తపనను పెంపొందిస్తూ తన అనుభవాన్ని శిక్షణలో ఉపయోగిస్తున్నారు.

సైన్యంలో సేవలందించిన అనుభవం నుంచి పొందిన క్ర మశిక్షణను యువతకు నేర్పుతూ, దేశ రక్షణ రంగంలో అడుగుపెట్టాలనుకునే అభ్యర్థులకు సరైన దిశానిర్దేశం చేస్తున్నారు. శారీరక శిక్షణ ద్వారా యువతలో ఆత్మ విశ్వాసాన్ని పెంపొందిస్తూ, తమ లక్ష్యాల సాధన కోసం నిరంతరం శ్రమించేలా ప్రోత్సహిస్తున్నారు. ఈ నేపథ్యంలో ఆవుల కమల్‌కు ఇంటర్నేషనల్ బుక్ ఆఫ్ రికార్డ్స్ అవార్డు లభించడం ఆయన ప్రస్థానంలో ఒక ముఖ్యమైన ఘట్టంగా నిలిచింది. రిటైర్డ్ ఆర్మీ కోచ్‌గా యువతకు శిక్షణ అందిస్తూ కొనసాగిస్తున్న ఆయన సేవలకు ఈ అవార్డు ప్రత్యేక గుర్తింపుగా నిలిచింది. ఆవుల కమల్‌కు ఇంటర్నేషనల్ బుక్ ఆఫ్ రికార్డ్స్ అవార్డు లభించిన సందర్భంగా కాంటెస్టెడ్ గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ అభ్యర్థి ఏనుగుల రాకేష్ రెడ్డి, రామప్ప డిఫెన్స్ జూనియర్ కళాశాల డైరెక్టర్ ఐలి కరుణాకర్, ప్రముఖ జీకే ఫ్యాకల్టీ మధుతో పాటు వివిధ సంఘాల నాయకులు అభినందనలు తెలిపారు.



దసరా ఉత్సవాలకు ట్రాఫిక్ ఆంక్షలు

అక్షరశక్తి, వరంగల్: అక్టోబర్ 20 మధ్యాహ్నం 3 గంటల నుంచి 21వ తేదీ తెల్లవారుజాము 3 గంటల వరకు అమలు వరంగల్, ఉర్సు రంగాలీల మైదానంలో ఈ నెల 20న నిర్వహించే దసరా ఉత్సవాల సందర్భంగా ట్రైసిటీ పరిధిలో ట్రాఫిక్ ఆంక్షలు విధించినట్లు వరంగల్ పోలీస్ కమిషనర్ ఎన్. శ్వేత తెలిపారు. అక్టోబర్ 20వ తేదీ మధ్యాహ్నం 3 గంటల నుంచి 21వ తేదీ తెల్లవారుజాము 3 గంటల వరకు ఈ ఆంక్షలు అమల్లో ఉంటాయని పేర్కొన్నారు.



భారీ వాహనాలకు మళ్లింపు మార్గాలు...

ఖమ్మం నుంచి వరంగల్ మీదుగా కరీంనగర్, హైదరాబాద్ వెళ్లే భారీ వాహనాలు ఫున్నెలు క్రాస్ నుంచి ఐనవోలు ఆర్చ్, వెంకటాపురం, కరుణాపురం మీదుగా వెళ్లాలి. కరీంనగర్ నుంచి ఖమ్మం వెళ్లే వాహనాలు కేయూసీ, పెద్దమ్మగడ్డ, హనుమాన్ జంక్షన్, పోచమ్మ మైదాన్, కాశిబుగ్గ, తెలంగాణ జంక్షన్, ఫోర్ట్ రోడ్ జంక్షన్ మీదుగా వెళ్లాలి. హైదరాబాద్ నుంచి ఖమ్మం వెళ్లే వాహనాలు కరుణాపురం, వెంకటాపురం, ఐనవోలు, ఫున్నెలు క్రాస్ మీదుగా వెళ్లాలని పోలీసులు సూచించారు.

వాహనాల పార్కింగ్ ఏర్పాట్లు

ఉర్సు గుట్టకు వచ్చే వాహనాల కోసం పలు ప్రాంతాల్లో పార్కింగ్ సదుపాయాలు కల్పించారు. హనుమకొండ హంటర్ రోడ్ నుంచి వచ్చే వాహనాలను కొలంబో ఆసుపత్రి, బీఆర్ నగర్ ఎదురుగా ఉన్న గానుగ ఆయిల్ పాయింట్ సమీపంలో, ఆకుతోట ఫంక్షన్ హాల్, నాని గార్డెన్, జేఎస్ఎం పాఠశాల వద్ద పార్కింగ్ చేయాలి. కడిపికొండ నుంచి వచ్చే వాహనాలకు భారత్ పెట్రోల్ బంక్ సమీపంలో పార్కింగ్ ఏర్పాటు చేశారు. ఆర్టీఓ జంక్షన్ నుంచి వచ్చే వాహనాలను లఫ్లీ ఫంక్షన్ హాల్ ఖాళీ స్థలంలో, తాళ్ల పద్మావతి కళాశాల సమీపంలో నిలపాలి. కరీమాబాద్ నుంచి వచ్చే వాహనాలకు భీరన్న గుడి వద్ద పార్కింగ్ సదుపాయం కల్పించారు. దసరా ఉత్సవాలకు వచ్చే భక్తులు ట్రాఫిక్ ఆంక్షలను గమనించి, పోలీసులకు సహకరించాలని వరంగల్ పోలీస్ కమిషనర్ ఎన్. శ్వేత కోరారు.

ఎస్సీ, ఎస్టీ కేసులో తప్పిదాలపై జర్నలిస్టుల ఫిర్యాదు

- **సమగ్ర విచారణ జరిపించాలని పోలీస్ కమిషనర్‌కు వినతి**

అక్షరశక్తి, హన్మకొండ : ఎస్సీ, ఎస్టీ కేసు (ఎఫ్ఐఆర్ నంబర్ 471/2025) విచారణలో జరిగిన తప్పిదాలపై సమగ్ర విచారణ జరిపించి, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరుతూ వరంగల్ పోలీస్ కమిషనర్ శ్వేతకు జర్నలిస్టులు శనివారం ఫిర్యాదుచేశారు. సుబేదారి పోలీస్ స్టేషన్ లో ఎఫ్ఐఆర్ నంబర్ 471/2025 కింద నమోదైన కేసులో తాము సాక్షులుగా ఉన్నామని జర్నలిస్టులు గడ్డం కేశవమూర్తి, తోట సుధాకర్, పెండెం వేణుమాధవ్, మేరుగుల రాజేంద్రప్రసాద్ తెలిపారు. విచారణ అధికారిగా ఉన్న హనుమకొండ ఏసీపీ నరసింహారావుతో పాటు ఏ ఒక్క పోలీసు అధికారి కూడా తమను విచారణకు పిలవలేదని పేర్కొన్నారు. తమ నుంచి ఎలాంటి వాంగ్మూలాలు తీసుకోలేదని ఫిర్యాదులో పేర్కొన్నారు. అయినప్పటికీ, 2025 ఆగస్టు 15న ఏసీపీ సమక్షంలో తాము వాంగ్మూలాలు ఇచ్చినట్లు పత్రాలు సృష్టించి వాటిని న్యాయస్థానానికి సమర్పించి కేసును మూసివేసినట్లు తమ దృష్టికి వచ్చిందని వివరించారు. ఇదే విషయంపై విచారణాధికారిగా ఉన్న సంబంధిత ఏసీపీని సంప్రదించడంతో కేసు మూసివేశామని తెలపడంతో ఖంగు తిన్నామని తెలిపారు. తమకు ఎలాంటి సమాచారం లేకుండా కేసును ఎలా మూసివేస్తారని ప్రశ్నించడంతో ఏమైనా ఉంటే కోర్టుకు వెళ్లి చూసుకోవాలని సమాధానమిచ్చారని పేర్కొన్నారు. తమను విచారించకుండానే తమ పేర్లతో వాంగ్మూలాలు ఎలా నమోదు చేశారు? వాటిని ఏ ఆధారాలతో న్యాయస్థానానికి సమర్పించారు? అనే అంశాలపై సమగ్ర విచారణ జరిపించాలని కోరారు. సంబంధిత పోలీసు రికార్డులు, వాంగ్మూలాలు, న్యాయస్థానానికి సమర్పించిన పత్రాలను పరిశీలించి, విచారణలో బాధ్యులుగా తేలిన అధికారులపై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని వినతిపత్రంలో విజ్ఞప్తి చేశారు. కోర్టు ద్వారా తీసుకున్న పత్రాలన్నింటినీ సిపీకి అందించారు. ఫిర్యాదును, పత్రాలను క్షుణ్ణంగా పరిశీలించిన పోలీస్ కమిషనర్ శ్వేత సానుకూలంగా స్పందించారు. కేసుకు సంబంధించిన పూర్తి వివరాలు సేకరించి విచారణ జరిపిస్తామని, బాధితులకు న్యాయం జరిగేలా చూస్తామని హామీ ఇచ్చినట్లు ఫిర్యాదుదారులు తెలిపారు. ఎస్సీ, ఎస్టీ కేసుకు సంబంధించిన కేసులో బాధితుడు కంకనాల సంతోష్ మరో ఫిర్యాదులో తనకు జరిగిన అన్యాయంపై సీపీకి వివరించారు. విచారణ చేసి న్యాయం చేయాలని కోరారు. సీపీని కలిసిన వారిలో జర్నలిస్ట్ వెల్ఫేర్ కమిటీ రాష్ట్ర కన్వీనర్ వల్లాల వెంకట రమణ, టీయూడబ్ల్యూజె హన్మకొండ జిల్లా అధ్యక్షులు గడ్డం కేశవమూర్తి, ప్రధాన కార్యదర్శి ఊటుకూరు సాయిరాం, కోశాధికారి పొడిచెట్టి విష్ణువర్ధన్ , గ్రేటర్ వరంగల్ ప్రెస్ క్లబ్ అధ్యక్షులు వేముల నాగరాజు, టియుడబ్ల్యూజే రాష్ట్ర బాధ్యులు పి .వేణుమాధవ్, తోట సుధాకర్, బోళ్ల అమర్, మేరుగుల రాజేంద్రప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



మీడియా స్వేచ్ఛకు షోయబుల్లాఖాన్ స్ఫూర్తి

అక్షరశక్తి, కొత్తగూడ: పత్రికా స్వేచ్ఛ, ప్రజాస్వామిక విలువల పరిరక్షణ కోసం పోరాడిన జర్నలిస్టు యోధుడు షోయబుల్లాఖాన్ అని టీయూడబ్ల్యూజే (ఐజేయూ) కొత్తగూడ మండల అధ్యక్షుడు ఎస్. కె.సల్మాన్‌పాషా అన్నారు. మండల కేంద్రంలోని గ్రామపంచాయతీ ఆవరణలో షోయబుల్లాఖాన్ 106వ జయంతి వేడుకలు నిర్వహించి ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సల్మాన్‌పాషా మాట్లాడుతూ.. ఉస్మానియా విశ్వవిద్యాలయంలో చదువుకున్న షోయబుల్లాఖాన్ ప్రభుత్వ ఉద్యోగాన్ని ఎంచుకోకుండా జర్నలిజం ద్వారా ప్రజలను చైతన్య పరిచేందుకు కృషి చేశారని తెలిపారు. తొలుత 'తేజ్' పత్రికలో పనిచేసి నిజాం ప్రభుత్వాన్ని, అధికార వర్గాలను విమర్శించినందుకు ఆ పత్రిక నిషేధానికి గురైందని గుర్తుచేశారు. ప్రస్తుతం మీడియా స్వేచ్ఛ, భావప్రకటనా స్వేచ్ఛ సవాళ్లను ఎదుర్కొంటున్నాయని, ప్రశ్నించే జర్నలిస్టులపై ట్రోలింగ్, భౌతిక దాడులు జరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 19(1)(ఎ) కల్పించిన భావప్రకటనా స్వేచ్ఛను కాపాడుకోవాల్సిన అవసరం ఉందన్నారు. దేశ ఐక్యత, లౌకిక, ప్రజాస్వామిక విలువల కోసం షోయబుల్లాఖాన్ చేసిన పోరాటాన్ని నేటి జర్నలిస్టులు స్ఫూర్తిగా తీసుకోవాలని పిలుపునిచ్చారు. షోయబుల్లాఖాన్ స్మారకంగా హిందూ-ముస్లిం ఐక్యతను పెంపొందించే జర్నలిస్టుకు తెలంగాణ మీడియా అకాడమీ తరఫున ఏటా అవార్డు అందించాలని, ఆయన జీవితాన్ని పాఠ్యాంశంగా బోధించాలని సూచించారు. కార్యక్రమంలో ఐజేయూ జిల్లా నాయకులు పాలడుగు శ్రీధర్, శెట్టి పరుశురాం, మండల ఉపాధ్యక్షుడు గోగు విజయ్‌కుమార్, ప్రచార కార్యదర్శి తీగల ప్రేమ్‌సాగర్, రాకేష్‌వర్మ, ముఖ్య సలహాదారులు బొజ్జ సునీల్, రాజు కుమార్, చాపల శ్రీనివాస్, వెంకట్ తదితరులు పాల్గొన్నారు.



గౌతమికి ఫార్మసీలో పీహెచ్‌డీ!



అక్షరశక్తి, హనుమకొండ: మడికొండకు చెందిన గౌతమి తుమ్మా కాకతీయ విశ్వవిద్యాలయం నుంచి ఫార్మసీ విభాగంలో డాక్టరేట్ పట్టా పొందారు. ఔషధాల జీవలభ్యతను పెంపొందించే నానో ఆధారిత ఔషధ పంపిణీ వ్యవస్థల రూపకల్పన, అభివృద్ధి, మూల్యాంకనంపై చేసిన పరిశోధనకు కాకతీయ విశ్వవిద్యాలయం పరీక్షల విభాగం పిహెచ్డి డిగ్రీని ప్రకటించింది.డాక్టర్ షయేదా పర్యవేక్షణలో "కొన్ని ఔషధాల జీవలభ్యతను పెంచేందుకు నానో కణాల ఆధారిత ఔషధ పంపిణీ వ్యవస్థల రూపకల్పన, అభివృద్ధి, మూల్యాంకనం" అనే అంశంపై గౌతమి పరిశోధన పూర్తిచేశారు. ఈ సందర్భంగా కాకతీయ విశ్వవిద్యాలయ ఉపకులపతి ఆచార్య కర్నాటి ప్రతాపరెడ్డి, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వి. రామ్‌చంద్రం, ఫార్మసీ విభాగం డీన్ ప్రొఫెసర్ ప్రసాద్ నీరటి, అధ్యయన మండలి సభ్యులు ప్రొఫెసర్ నాగరాజ్ బద్దం తదితరులు ఆమెను అభినందించారు. గౌతమి డాక్టరేట్ సాధించడం పట్ల స్థానికులు, విద్యావేత్తలు హర్షం వ్యక్తం చేశారు.

ఎన్‌పీడీసీఎల్‌కు 14వ ఇన్నోవేషన్ విత్ ఇంపాక్ట్ అవార్డు



అక్షరశక్తి, హనుమకొండ: విద్యుత్ పంపిణీ రంగంలో ఆధునిక సాంకేతిక పరిజ్ఞాన వినియోగం, వినూత్న కార్యక్రమాల అమలుకు గాను టీజీఎన్‌పీడీసీఎల్‌కు 14వ ఇన్నోవేషన్ విత్ ఇంపాక్ట్ అవార్డు ఫర్ డిస్కామ్స్ లభించింది. ఇండియన్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ ఆధ్వర్యంలో న్యూఢిల్లీలో అక్టోబర్ 14న నిర్వహించిన 20వ ఇండియా ఎనర్జీ సమ్మిట్‌లో భాగంగా ఈ అవార్డును సంస్థ కంపెనీ కార్యదర్శి కె. వెంకటేశం అందుకున్నారు. శనివారం హనుమకొండ నక్కలగుట్టలోని సంస్థ ప్రధాన కార్యాలయంలో డైరెక్టర్లు వి. మోహన్ రావు, వి. తిరుపతి రెడ్డి, టి. మధుసూదన్, సి. ప్రభాకర్, కంపెనీ కార్యదర్శి కె. వెంకటేశం అవార్డును సీఎండీ కర్ణాటి వరుణ్ రెడ్డికి అందజేశారు. ఈ సందర్భంగా సీఎండీ మాట్లాడుతూ, వినియోగదారులకు నాణ్యమైన, నమ్మకమైన విద్యుత్ సరఫరా అందించేందుకు రియల్‌టైమ్ ఫీడర్ పర్యవేక్షణ, స్కాడా వ్యవస్థ, ఫాల్ట్ ప్యాసేజ్ ఇండికేటర్లు, డ్రోన్ తనిఖీలు, జీఐఎస్ మ్యాపింగ్, ఆటోమేటిక్ మీటర్ రీడింగ్, కృత్రిమ మేధ ఆధారిత చాట్‌బాట్, డిజిటల్ ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థలను వినియోగిస్తున్నట్లు తెలిపారు. పునరుత్పాదక విద్యుత్ స్థాపిత సామర్థ్యం 2024-25లో 1,784 మెగావాట్ల నుంచి 2025-26లో 2,126 మెగావాట్లకు పెరిగిందన్నారు. అదే సమయంలో పైకప్పులపై సౌర విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యం 80.17 మెగావాట్ల నుంచి 143.92 మెగావాట్లకు చేరి సుమారు 79.5 శాతం వృద్ధి నమోదైందని వివరించారు. వినియోగదారులకు నిరంతర విద్యుత్ సరఫరా, ఫిర్యాదులపై వేగవంతమైన స్పందన, అంతరాయాలను తగ్గించడం, లోపాలను త్వరగా గుర్తించి సరఫరాను పునరుద్ధరించడం లక్ష్యంగా సంస్థ పనిచేస్తోందని కర్ణాటి వరుణ్ రెడ్డి పేర్కొన్నారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం ద్వారా సేవల నాణ్యత, నిర్వహణ సామర్థ్యం, వినియోగదారుల సంతృప్తిని పెంపొందించేందుకు చేపడుతున్న కార్యక్రమాలకు జాతీయ స్థాయిలో అవార్డు లభించడం గర్వకారణమన్నారు. ఈ గుర్తింపు సంస్థ అధికారులు, ఇంజినీర్లు, క్షేత్రస్థాయి సిబ్బంది సమష్టి కృషికి నిదర్శనమని తెలిపారు.

హాఫ్ మారథాన్‌లో హెడ్ కానిస్టేబుల్ జయరాజ్ ప్రతిభ



అక్షరశక్తి, వరంగల్: వరంగల్ ట్రైసిటీలో నిర్వహించిన హాఫ్ మారథాన్ రెండో ఎడిషన్ పోటీల్లో కాకతీయ యూనివర్సిటీ పోలీస్ స్టేషన్ హెడ్ కానిస్టేబుల్ జయరాజ్ ప్రతిభ చాటారు. 10 కిలోమీటర్ల పరుగును గంటా 26 నిమిషాల్లో పూర్తి చేసి విజేతగా నిలిచారు. ఈ సందర్భంగా పోలీస్ అధికారి ఎం. రంజిత్ కుమార్ చేతుల మీదుగా జయరాజ్ పతకాన్ని అందుకున్నారు. పరుగు పోటీల్లో ప్రతిభ కనబరిచిన జయరాజ్‌ను పలువురు అభినందించారు.

పేద విద్యార్థినికి రూ.30 వేల ఆర్థిక సాయం

నర్సింగ్ ఫీజు కోసం విద్యఫౌండేషన్ చేయూత



అక్షరశక్తి, హన్మకొండ: పేద విద్యార్థిని నర్సింగ్ కోర్సు చదివేందుకు విద్య ఫౌండేషన్ స్వచ్ఛంద సంస్థ రూ.30 వేల ఆర్థిక సాయం అందించింది. స్టేషన్ ఘన్‌పూర్‌కు చెందిన గాదె అంజలికి ఫీజు చెల్లించేందుకు రూ.30 వేల చెక్కును సంస్థ వ్యవస్థాపకుడు బిల్ల మహేందర్, దాత కాసం కిషన్‌రెడ్డి చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా బిల్ల మహేందర్ మాట్లాడుతూ.. ఇంటర్‌లో మెరుగైన ఫలితాలు సాధించిన అంజలి నర్సింగ్ కోర్సు చదివేందుకు అవసరమైన ఫీజు చెల్లించలేని పరిస్థితిని గుర్తించి ఈ సాయం అందించినట్లు తెలిపారు. అమెరికాలో ఉంటున్న తన బాల్యమిత్రుడు కాసం దిలీప్‌రెడ్డి సహకారంతో విద్యార్థినికి చేయూతనిచ్చినట్లు పేర్కొన్నారు. సహకరించిన దాతకు కృతజ్ఞతలు తెలిపారు. వడ్డేపల్లిలోని టీఎన్‌జీవోస్ కాలనీ ఫేజ్-2లో ఉన్న సంస్థ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఫౌండేషన్ గౌరవ సలహాదారు గురిజాల తిరుపతిరెడ్డి, కార్యదర్శి కలకోట్ల నరేందర్, రాధికా నరేన్, ఉదయశ్రీ ప్రభాకర్, క.స. శోభారాణి, కూరపాటి రమేష్, కడుదుల సోమన్న, బిల్ల సరిత, గాదె లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

సేవాలాల్ ఆలయానికి స్థలం కేటాయించాలి

సర్పంచి, రెవెన్యూ అధికారులకు వినతి



అక్షరశక్తి, గూడూరు: మహబూబాబాద్ జిల్లా మండల కేంద్రంలో జగద్గురు సంత్ సేవాలాల్ మహారాజ్ ఆలయ నిర్మాణానికి ప్రభుత్వ స్థలం కేటాయించాలని కోరుతూ బంజారా సంఘం నాయకులు గ్రామ సర్పంచి సునీత కొమ్మాలు నాయక్, డిప్యూటీ తహసీల్దార్ కోమలకు వినతిపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. మండలంలో అధిక సంఖ్యలో ఉన్న గిరిజన బంజారాల ఆరాధ్య దైవమైన సేవాలాల్ మహారాజ్ ఆలయ నిర్మాణం దశాబ్దాల కల అని పేర్కొన్నారు. బంజారాల ఆధ్యాత్మిక, సాంస్కృతిక ప్రతీకగా నిలిచే ఆలయ నిర్మాణానికి ప్రజాప్రతినిధులు, అధికారులు, ప్రజలు సహకరించాలని కోరారు. స్థల కేటాయింపు ప్రక్రియను వేగవంతం చేసి ఆలయ నిర్మాణానికి మార్గం సుగమం చేయాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో గిరిజన సంఘ నాయకులు, గ్రామ ప్రముఖులు, బంజారా యువకులు పాల్గొన్నారు.

జమ్ముల కృష్ణారెడ్డికి నివాళి

అక్షరశక్తి, గూడూరు: మహబూబాబాద్ జిల్లా గూడూరు మండల కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు స్వర్గీయ జమ్ముల కృష్ణారెడ్డి వర్ధంతిని గూడూరు మండల కేంద్రంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో గూడూరు మేజర్ గ్రామపంచాయతీ సర్పంచి వాంకుదోత్ సునీత కొమ్మాలు నాయక్, కాంగ్రెస్ పార్టీ మాజీ మండల అధ్యక్షుడు చిట్ట వెంకన్న, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ బీరం శ్రీపాల్‌రెడ్డి, ఉపసర్పంచి చంటి స్వామి, నాయకులు బుడిగే సతీష్, జిల్లా మైనార్టీ సెల్ కార్యదర్శి ఎం.డి.రసూల్, టౌన్ కాంగ్రెస్ అధ్యక్షుడు రాసమల్ల యాకయ్య, ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు కందిక శంకర్, గొల్లపల్లి సర్పంచి మహేష్, వార్డు సభ్యుడు పత్యం వెంకన్న, పొన్నం వెంకన్న, రాసమల్ల రాములు, అర్రెం వీరస్వామి, ఎలమందల శ్రీనివాస్, తంగళ్లపల్లి సునీల్, గోనె శోభన్, పాపాని శ్రీనివాస్, రాజేష్, యాదగిరి, కప్పల అనిల్, పానుగంటి రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మెల్సీ ఎన్నికల్లో గులాబీ జెండా ఎగరాలి

- **మళ్లీ కేసీఆర్ నాయకత్వంవైపే తెలంగాణ ప్రజల చూపు!**
- **కాంగ్రెస్ మూడేళ్ల పాలనలో అభివృద్ధి శూన్యం**
- **ప్రజా సమస్యలపై సమీక్షలేవీ.. కాంట్రాక్టులపైనే హడావుడి**
- **ఓరుగల్లులో మంత్రులున్నా.. ఇన్‌చార్జి పెత్తనమే!**
- **పట్టభద్రుల ఓటరు నమోదును ఉద్యమంలా చేపట్టాలి**
- **ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి, మాజీ చీఫ్‌విప్ దాస్యం వినయ్‌భాస్కర్**



అక్షరశక్తి, హనుమకొండ, అక్టోబరు 17 : తెలంగాణ ప్రజలు మళ్లీ బీఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ నాయకత్వాన్ని కోరుకుంటున్నారని ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం మూడేళ్ల పాలనలో రాష్ట్రానికి చేసిందేమీ లేదని, ప్రజా సమస్యల పరిష్కారంపై దృష్టి పెట్టకుండా కాంట్రాక్టుల చుట్టూనే సమీక్షలు నిర్వహిస్తోందని విమర్శించారు. ఓరుగల్లుకు చెందిన మంత్రులు ఉన్నప్పటికీ ఇన్‌చార్జి మంత్రి పెత్తనమే కొనసాగుతోందని ఆరోపించారు. రాబోయే పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థి విజయమే లక్ష్యంగా నాయకులు, కార్యకర్తలు క్షేత్రస్థాయిలో పనిచేయాలని పిలుపునిచ్చారు.

పట్టభద్రుల ఓటరు నమోదుపై ప్రత్యేక దృష్టి

ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో కుడా మాజీ చైర్మన్ మర్రి యాదవరెడ్డి అధ్యక్షతన బాలసముద్రంలోని బీఆర్ఎస్ హనుమకొండ జిల్లా కార్యాలయంలో వరంగల్ పశ్చిమ నియోజకవర్గ కార్యకర్తల విస్తృతస్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టభద్రుల ఓటరు నమోదు ప్రక్రియపై పార్టీ శ్రేణులకు నాయకులు దిశానిర్దేశం చేశారు. అర్హులైన పట్టభద్రులను గుర్తించి ఓటర్లుగా నమోదు చేయించే బాధ్యతను ప్రతి నాయకుడు, కార్యకర్త తీసుకోవాలని సూచించారు. ఎన్నికల్లో పార్టీ విజయానికి ఓటరు నమోదు కీలకమని స్పష్టం చేశారు.

కాంట్రాక్టులపై సమీక్షలే తప్ప..

ప్రజా సమస్యలపై పట్టింపు లేదు

సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ.. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో విజయం సాధించాలంటే ఓటరు నమోదు ప్రక్రియను ఉద్యమంలా చేపట్టాలని అన్నారు. నాయకులు, కార్యకర్తలు తమ పరిసరాల్లోని పట్టభద్రులను గుర్తించి, వారి ఓటరు నమోదు పూర్తయ్యేలా చూడాలని సూచించారు. అందరూ సమష్టిగా కృషి చేస్తే మూడు రోజుల్లోనే పెద్ద సంఖ్యలో పట్టభద్రులను ఓటర్లుగా నమోదు చేయించవచ్చని పేర్కొన్నారు. హనుమకొండ ప్రాంతంలో ఉద్యోగులు, ఉపాధ్యాయులు, వివిధ రంగాలకు చెందిన పట్టభద్రులు అధికంగా ఉన్నందున వారిని నేరుగా కలిసి ఓటరు నమోదుపై అవగాహన కల్పించాలని కోరారు. బీఆర్ఎస్‌కు హనుమకొండ గుండెకాయ వంటిదని, ఇక్కడి నుంచి నమోదు ప్రక్రియను పకడ్బందీగా చేపట్టాలని సూచించారు. పార్టీ అభ్యర్థి విజయమే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ బాధ్యతతో పనిచేయాలని పిలుపునిచ్చారు.

రాష్ట్రంలో కాంగ్రెస్ పాలనపై విమర్శలు గుప్పిస్తూ.. మూడేళ్లలో తెలంగాణకు ఆ పార్టీ చేసిందేమీ లేదన్నారు. మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి కాంట్రాక్టులకు సంబంధించిన అంశాలపై సమీక్షలు నిర్వహిస్తున్నారే తప్ప, ప్రజా సమస్యల పరిష్కారానికి అదే స్థాయిలో ప్రాధాన్యం ఇవ్వడం లేదని ఆరోపించారు. ఓరుగల్లుకు చెందిన మంత్రులు ఉన్నప్పటికీ ఇన్‌చార్జి మంత్రి పెత్తనం కొనసాగుతోందని విమర్శించారు. ఎంపీ ఎన్నికల సమయంలో హనుమకొండ చౌరస్తాకు వచ్చి ఇచ్చిన రెండు హామీలపై శాసనమండలిలో ప్రశ్నిస్తే, తమకు తెలియదని మంత్రులు చెప్పిన విషయాన్ని ఆయన గుర్తుచేశారు. కేసీఆర్ హయాంలో నియోజకవర్గానికి ఎమ్మెల్యేనే బాస్‌గా ఉండేవారని, ప్రస్తుతం నియోజకవర్గానికి నిధులు రావాలన్నా ఇతరుల దయాదాక్షిణ్యాలపై ఆధారపడాల్సిన పరిస్థితి ఏర్పడిందని ఎద్దేవా చేశారు.

అణచివేతలు, కేసులకూ వెనకాడేది లేదు:

దాస్యం వినయ్‌భాస్కర్

ప్రభుత్వ మాజీ చీఫ్‌విప్, మాజీ ఎమ్మెల్యే దాస్యం వినయ్‌భాస్కర్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రజావ్యతిరేక విధానాలపై మూడేళ్లుగా బీఆర్ఎస్ అలుపెరగని పోరాటం చేస్తోందన్నారు. హనుమకొండలో తనతోపాటు పార్టీ శ్రేణులపై అణచివేతలు, కేసులు కొనసాగుతున్నప్పటికీ ప్రజా ఉద్యమాలను ఆపడం లేదని తెలిపారు. ప్రజలకు ఏ కష్టం వచ్చినా బీఆర్ఎస్ అండగా ఉంటుందనే విశ్వాసం ప్రజల్లో ఉందన్నారు.

రాబోయే ఎమ్మెల్సీ ఎన్నికల్లో గులాబీ జెండా ఎగరడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. పార్టీ ఆదేశాల మేరకు ఇప్పటికే డివిజన్ల వారీగా హెల్ప్‌లైన్ కేంద్రాలను ఏర్పాటు చేసి పట్టభద్రుల ఓటరు నమోదు చేపట్టినట్లు వెల్లడించారు. వరంగల్ పశ్చిమ నియోజకవర్గంలో పట్టభద్రులు అధికంగా ఉన్నందున ప్రత్యేక కార్యాచరణ రూపొందించినట్లు తెలిపారు. అర్హులైన ప్రతి ఒక్కరినీ గుర్తించి ఓటరుగా నమోదు చేయించాలని సూచించారు. క్షేత్రస్థాయిలో కష్టపడి పనిచేసే నాయకులు, కార్యకర్తలకు పార్టీలో తగిన గుర్తింపు ఉంటుందని చెప్పారు. ప్రజలంతా మళ్లీ కేసీఆర్ నాయకత్వం వైపు చూస్తున్నారని పేర్కొన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికల విజయమే లక్ష్యం: రాకేష్‌రెడ్డి

బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు ఏనుగుల రాకేశ్‌రెడ్డి మాట్లాడుతూ.. తెలంగాణ సమాజం కేసీఆర్ నాయకత్వాన్ని తిరిగి కోరుకుంటోందన్నారు. రాబోయే ఎమ్మెల్సీ ఎన్నికల్లో విజయం సాధిస్తే ఆ ప్రభావం స్థానిక సంస్థల ఎన్నికలపైనా ఉంటుందని, తద్వారా రాష్ట్రంలో బీఆర్ఎస్ తిరిగి అధికారంలోకి వచ్చే అవకాశాలు మెరుగవుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పాలనలో అభివృద్ధి శూన్యమని విమర్శించారు. సర్పంచ్ ఎన్నికల తర్వాత ఎంపీటీసీ, కార్పొరేషన్ ఎన్నికలు నిర్వహించకపోవడానికి బీఆర్ఎస్ గెలుస్తుందనే భయమే కారణమని ఆరోపించారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోటీ చేసేందుకు కాంగ్రెస్ నాయకులే వెనుకంజ వేస్తున్నారని వ్యాఖ్యానించారు. గత ఎన్నికల్లో స్వల్ప తేడాతో ఓటమి పాలైనప్పటికీ గట్టి పోటీ ఇచ్చానని, నిరుద్యోగుల పోటీ పరీక్షల్లో అవినీతి, ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై నిరంతరం ప్రశ్నిస్తూ పోరాటం కొనసాగించానని గుర్తుచేశారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం తన పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు.

12 నియోజకవర్గాల్లో నమోదు కేంద్రాలు: నాగుర్ల

రైతు రుణ విమోచన కమిషన్ మాజీ చైర్మన్ నాగుర్ల వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో 12 నియోజకవర్గాల్లో ఓటరు నమోదు కేంద్రాలను ఏర్పాటు చేసి అర్హులైన పట్టభద్రులను నమోదు చేయించాలని సూచించారు. పండుగలు, ఇతర సందర్భాల్లో స్వగ్రామాలకు వచ్చే పట్టభద్రులను కలిసి ఓటరు నమోదుపై అవగాహన కల్పించాలని కోరారు. కేసీఆర్ మళ్లీ ముఖ్యమంత్రి కావాలని అన్ని వర్గాల ప్రజలు కోరుకుంటున్నారని అన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో పార్టీ విజయానికి పట్టభద్రుల మద్దతు కీలకమని, ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని పిలుపునిచ్చారు. దివ్యాంగుల కార్పొరేషన్ మాజీ చైర్మన్ డాక్టర్ వాసుదేవరెడ్డి మాట్లాడుతూ.. పట్టభద్రుల ఓటరు నమోదు ప్రక్రియను మరింత వేగవంతం చేయాలని సూచించారు. ఉద్యోగులు, ఉపాధ్యాయులు, ఇతర వృత్తుల్లో ఉన్న అర్హులైన పట్టభద్రులను గుర్తించి ఓటర్లుగా నమోదు చేయించేందుకు నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలన్నారు. ఓటరు నమోదు కార్యక్రమాన్ని పార్టీ అభ్యర్థి విజయానికి పునాదిగా మలుచుకోవాలని పిలుపునిచ్చారు. కాంగ్రెస్ మూడేళ్ల పాలనలో అన్ని వర్గాల ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని విమర్శించారు. పార్టీ శ్రేణులంతా ఐక్యంగా పనిచేసి ఎమ్మెల్సీ ఎన్నికల్లో గులాబీ జెండా ఎగురవేయాలని కోరారు. ఈ సమావేశంలో మాజీ కార్పొరేటర్లు, రాష్ట్రస్థాయి నాయకులు, డివిజన్ అధ్యక్షులు, ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పోలీస్ ఫ్లాగ్ డే సందర్భంగా పోటీలు

అక్షరశక్తి, వరంగల్: పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవం, పోలీస్ ఫ్లాగ్ డే సందర్భంగా వరంగల్ పోలీస్ కమిషనరేట్ ఆధ్వర్యంలో అక్టోబర్ 21 నుంచి 31వ తేదీ వరకు వివిధ పోటీలు నిర్వహించనున్నారు. ప్రతిభ కనబరిచిన మొదటి ముగ్గురు విజేతలకు అవార్డులు అందజేయడంతో పాటు రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొనే అవకాశం కల్పించనున్నారు. వ్యాసరచన పోటీలు: తెలుగు, ఆంగ్లం, ఉర్దూ భాషల్లో నిర్వహించే ఈ పోటీల్లో 12వ తరగతి వరకు చదివే విద్యార్థులు నేరాల నివారణలో పోలీసు-పౌరుల పాత్ర, డ్రగ్స్ నివారణలో పోలీసుల బాధ్యత, విద్యార్థులు మాదక ద్రవ్యాలకు ఎలా దూరంగా ఉండాలనే అంశాలపై రాయాలి. డిగ్రీ, ఆపై చదువుతున్న వారు సామాజిక మాధ్యమాల దుర్వినియోగాన్ని అరికట్టడంలో పోలీసుల పాత్ర, తెలంగాణను మాదకద్రవ్య రహిత రాష్ట్రంగా తీర్చిదిద్దడంలో తమ పాత్రపై వ్యాసాలు రాయవచ్చు. 500 పదాలకు మించకుండా రాసిన వ్యాసాలను పీడీఎఫ్ రూపంలో అక్టోబర్ 24లోపు ఈ లింక్ ద్వారా పంపాలి. లఘు చిత్రాలు, ఛాయాచిత్రాల పోటీలు: పోలీసుల త్యాగాలు, విధులు, ప్రతిభ, ప్రజల రక్షణ అంశాలపై మూడు నిమిషాలకు మించని లఘు చిత్రాలను, 10×8 అంగుళాల పరిమాణంలో మూడు ఛాయాచిత్రాలను సమర్పించాలి. వీటిని అక్టోబర్ 23వ తేదీ సాయంత్రంలోగా హనుమకొండ పోలీస్ హెడ్‌క్వార్టర్స్‌లోని ప్రజా సంబంధాల అధికారికి అందజేయాలి. ఎంపికైన ఉత్తమ మూడు చిత్రాలను రాష్ట్ర స్థాయి పోటీలకు పంపనున్నారు. వ్యాసాలు, ప్రత్యేక కథనాలు: పోలీసుల త్యాగాలు, వృత్తిపరమైన సేవలపై రచయితలు, పాత్రికేయులు రాసిన వ్యాసాలను అక్టోబర్ 19వ తేదీ సాయంత్రంలోగా హనుమకొండ పోలీస్ హెడ్‌క్వార్టర్స్‌లో అందజేయాలి. ఎంపికైన వ్యాసాలను అక్టోబర్ 21 నుంచి వారం రోజుల పాటు తెలుగు, ఆంగ్లం, ఉర్దూ వార్తాపత్రికల్లో ప్రచురించనున్నారు. ఆసక్తి గలవారు నిర్ణీత గడువులోగా తమ రచనలు, చిత్రాలను సమర్పించి ఈ కార్యక్రమాల్లో పాల్గొనాలని తెలిపారు.

యువత ఆరోగ్యంపై దృష్టి పెట్టాలి

- క్రీడలను జీవితంలో భాగం చేసుకోవాలి
- మంత్రి శ్రీధర్‌బాబు
- ట్రై సిటీస్ హాఫ్ మారథాన్–2026





అక్షరశక్తి, హనుమకొండ: యువతలో క్రీడాస్ఫూర్తిని పెంపొందించడంతోపాటు ఆరోగ్యంపై అవగాహన కల్పించేందుకు ట్రై సిటీస్ హాఫ్ మారథాన్ నిర్వహించడం అభినందనీయమని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు అన్నారు. నాయిని విశాల్ ట్రస్ట్, క్రెడాయ్ వరంగల్ ఆధ్వర్యంలో నిర్వహించిన ట్రై సిటీస్ హాఫ్ మారథాన్-2026 రెండో ఎడిషన్‌లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని 5కే పరుగును జెండా ఊపి ప్రారంభించారు. వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి, వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు పాల్గొన్నారు. మంత్రి మాట్లాడుతూ.. ఆరోగ్యమే మహాభాగ్యమని, వ్యాయామం, క్రీడలు, ధ్యానం ద్వారా ఒత్తిడి, ఆందోళన వంటి సమస్యలను అధిగమించవచ్చని తెలిపారు. యువత చెడు అలవాట్లకు దూరంగా ఉంటూ క్రీడలను జీవితంలో భాగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. మారథాన్‌లో పాల్గొనేందుకు నాలుగు నుంచి ఐదు వేల మంది నమోదు చేసుకోవడం సంతోషకరమన్నారు. వరంగల్, హనుమకొండ నగరాల అభివృద్ధికి ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందని తెలిపారు. వరంగల్ విమానాశ్రయం, కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్క్, పారిశ్రామిక అభివృద్ధి, ఉపాధి అవకాశాల కల్పనకు కృషి చేస్తున్నట్లు పేర్కొన్నారు. వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు మాట్లాడుతూ.. క్రీడలు మానసిక ఒత్తిడిని తగ్గించి ఆత్మవిశ్వాసాన్ని పెంపొందిస్తాయని తెలిపారు. నాయిని విశాల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డి, డాక్టర్ శ్రీగోదారెడ్డిలను అభినందించారు. ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. యువతలో ఆరోగ్యంపై అవగాహన పెంపొందించడం, డ్రగ్స్ వంటి చెడు అలవాట్లకు దూరంగా ఉంచడం, క్రీడాస్ఫూర్తిని పెంచడమే మారథాన్ లక్ష్యమన్నారు. కార్యక్రమానికి సహకరించిన మంత్రి శ్రీధర్‌బాబు, ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు, క్రెడాయ్ ప్రతినిధులు, స్పాన్సర్లు, నిర్వాహకులు, క్రీడాకారులు, యువతకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, అధికారులు, క్రీడా సంఘాల ప్రతినిధులు, మారథాన్ నిర్వాహకులు, రన్నర్లు, యువత పాల్గొన్నారు.

సాఫ్ట్‌బాల్ విజేత నిజామాబాద్

- రన్నరప్‌గా సిద్దిపేట..
- మూడో స్థానంలో మహబూబ్‌నగర్





అక్షరశక్తి, హనుమకొండ: హనుమకొండ జిల్లా సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన 11వ రాష్ట్రస్థాయి మినీ సబ్ జూనియర్ బాలుర సాఫ్ట్‌బాల్ ఛాంపియన్‌షిప్‌లో నిజామాబాద్ జట్టు విజేతగా నిలిచింది. సిద్దిపేట జట్టు రెండో స్థానం, మహబూబ్‌నగర్ జట్టు మూడో స్థానం, మంచిర్యాల జట్టు నాలుగో స్థానం సాధించాయి. శనివారం నిర్వహించిన ముగింపు కార్యక్రమానికి జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎం.డి.అజీజ్‌ఖాన్ ముఖ్య అతిథిగా, గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ అదనపు కమిషనర్ ఈసంపల్లి జోన, జిల్లా క్రీడాభివృద్ధి అధికారి ప్రశాంత్ గౌరవ అతిథులుగా హాజరయ్యారు. విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా అజీజ్‌ఖాన్ మాట్లాడుతూ.. ఉమ్మడి వరంగల్ జిల్లా సాఫ్ట్‌బాల్ క్రీడా సంఘానికి సహకారం అందించి క్రీడాకారుల అభివృద్ధికి కృషి చేస్తామని తెలిపారు. జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలో క్రీడాకారులకు మైదాన వసతులు కల్పించడంతోపాటు ఫెన్సింగ్ ఏర్పాటు చేయడానికి చర్యలు తీసుకుంటామని చెప్పారు. జిల్లా క్రీడాభివృద్ధి అధికారి ప్రశాంత్, అదనపు కమిషనర్ ఈసంపల్లి జోన, ఆల్ ఇండియా సాఫ్ట్‌బాల్ సంయుక్త కార్యదర్శి శోభన్‌బాబు, అసోసియేషన్ కార్యదర్శి తాబేటి రాజేందర్, డాక్టర్ ఫణిందర్, సంఘ ప్రతినిధులు లయన్ రేవూరి రమణారెడ్డి, ఉపసర్పంచి నర్మెట్ట వెంకటరమణగౌడ్, ఆర్గనైజింగ్ కమిటీ కన్వీనర్ పెరుమాండ్ల సాంబమూర్తి మాట్లాడుతూ.. సాఫ్ట్‌బాల్ క్రీడాకారులకు విద్య, ఉద్యోగ అవకాశాల్లో ప్రాధాన్యం లభిస్తుందని తెలిపారు.
టోర్నీ విజయవంతానికి కృషి చేసిన ఆర్గనైజింగ్ కమిటీ సభ్యులు పోలేపాక వినయ్‌కుమార్, అర్జున్, నరేష్, మధు, రాజేశ్వర్, తాబేటి నాగరాజు, సుమలత, సృజన, సుష్మ, శివ, శశాంక్, బుస రాజు, శేఖర్, చక్రం, సర్దార్, అయాన్ కార్తీక్, దినేష్, ప్రశాంత్, పవన్, అభిలాష్ తదితరులను జిల్లా అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ పిల్లి సాంబశివరావు, కార్యదర్శి తాబేటి రాజేందర్ అభినందించారు. కార్యక్రమంలో రాష్ట్ర సాఫ్ట్‌బాల్ సంఘం కార్యదర్శి నవీన్‌కుమార్, ఇతర జిల్లాల కార్యదర్శులు గంగ మోహన్, నాగిరెడ్డి, జిల్లా సంఘం సంయుక్త కార్యదర్శులు సుమలత, రాజేశ్వర్, తాబేటి నాగరాజు, పోలేపాక వినయ్, మధు, సృజన, సుష్మ తదితరులు పాల్గొన్నారు.

టెన్నిస్ అభివృద్ధికి ప్రత్యేక చర్యలు

- కోర్టుల పునరుద్ధరణకు ఎమ్మెల్యే నాగరాజు హామీ



అక్షరశక్తి, హనుమకొండ: జిల్లాలో టెన్నిస్ క్రీడాభివృద్ధికి అవసరమైన వసతులు కల్పించేందుకు కృషి చేస్తామని వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు హామీ ఇచ్చారు. హనుమకొండలోని జేవీఎస్ స్టేడియంలో నిర్వహించిన 70వ రాష్ట్రస్థాయి పాఠశాల క్రీడా సమాఖ్య టెన్నిస్ టోర్నమెంట్ కమ్ సెలక్షన్స్ ముగింపు కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. వరంగల్ పోలీస్ కమిషనర్ కే.శ్వేత ప్రత్యేక అతిథిగా హాజరయ్యారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. జేవీఎస్ స్టేడియంలోని టెన్నిస్ కోర్టులను పునరుద్ధరించడం, క్రీడా సామగ్రి అందించడం, రాత్రివేళల్లో సాధన కోసం ఫ్లడ్‌లైట్లు ఏర్పాటు చేయడం వంటి చర్యలు తీసుకుంటామని తెలిపారు. మెరుగైన వసతులు కల్పిస్తే విద్యార్థులు రాష్ట్ర, జాతీయ స్థాయిలో రాణిస్తారని పేర్కొన్నారు. పోలీస్ కమిషనర్ కే.శ్వేత మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలలు, హాస్టళ్లలో చదివే విద్యార్థులకు టెన్నిస్ శిక్షణ అవకాశాలు కల్పించేందుకు ప్రోత్సాహం అందిస్తామని తెలిపారు. క్రీడలు క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసం, మానసిక స్థైర్యాన్ని పెంపొందిస్తాయని చెప్పారు.
అనంతరం విజేతలకు బహుమతులు అందజేశారు. అండర్-17 బాలుర, బాలికల జట్ల ఛాంపియన్‌షిప్‌లను రంగారెడ్డి జిల్లా జట్లు సాధించాయి. అండర్-19 బాలుర విభాగంలో హైదరాబాద్, బాలికల విభాగంలో రంగారెడ్డి జిల్లా జట్లు విజేతలుగా నిలిచాయి. అండర్-17 బాలికల్లో ఇమాని మోక్షసాయి, బొమ్మారెడ్డి జానకి రెడ్డి, సురబోయిన వాగ్దేవి, అరూబా ఇమామ్, గోవింద్ ఆల్య తొలి ఐదు స్థానాల్లో నిలిచారు. బాలుర విభాగంలో వంజి ఆర్యన్, అద్వైత్, రుద్రాన్ష్ శ్రీవాస్తవ్, అక్షజ్ పద్మ, డి.ఆదిత్య తొలి ఐదు స్థానాలు సాధించారు.
అండర్-19 బాలికల్లో బి.భావిష్య క్రాంతి, డి.అర్జవి, ఎస్.శ్రీతన్య, వి.సాయి నేత్ర, పి.శ్రీనిత్ సాయి తొలి ఐదు స్థానాల్లో నిలిచారు. బాలుర విభాగంలో జె.సిద్ధార్థ్, కె.చంద్ర సిద్ధార్థ్, కె.యు.అభిరామ్, పి.నిఖిలేష్, పి.కార్తీక్ సుహాస్‌బాబు తొలి ఐదు స్థానాలు సాధించారు. కార్యక్రమంలో పాఠశాలల క్రీడా కార్యదర్శులు శ్రీధర్, వాసుదేవరావు, జిల్లా యువజన క్రీడాధికారి కొత్త ప్రశాంత్, హనుమకొండ జిల్లా టెన్నిస్ అసోసియేషన్ అధ్యక్షుడు పింగిలి వెంకటేశ్వరరావు, కార్యదర్శి ఎర్రగట్టు స్వామి, ప్యాట్రన్ రవిచంద్ర, కోశాధికారి సిరికొండ సంజీవరావు, ఆర్గనైజింగ్ సెక్రటరీ పెరుమాండ్ల వెంకటేశ్వర్లు, పీఈటీ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు ప్రభాకర్‌రెడ్డి, ఆఫీసర్ క్లబ్ జాయింట్ సెక్రటరీ కన్నారెడ్డి, ఫిజికల్ డైరెక్టర్ బరుపాటు గోపి, అబ్జర్వర్లు శ్రీనివాస్, రాజమల్లు తదితరులు పాల్గొన్నారు.

కరువు కాటకాలు తొలగిపోవాలి



అక్షరశక్తి, ములుగు : దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని ములుగు జిల్లా ఇంచర్ల గ్రామంలో మెపా జిల్లా అధ్యక్షుడు అచ్చునూరి కిషన్ దంపతులు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేదమంత్రోచ్చారణల మధ్య అమ్మవారిని దర్శించుకుని గ్రామ ప్రజల శ్రేయస్సు కోసం ప్రార్థించారు. ఈ సందర్భంగా కిషన్ మాట్లాడుతూ.. అమ్మవారి కరుణాకటాక్షాలతో ఎల్‌నినో ప్రభావం, కరువు కాటకాలు తొలగిపోయి సమృద్ధిగా వర్షాలు కురవాలని ఆకాంక్షించారు. పాడిపంటలు సమృద్ధిగా పండి రైతుల ఇళ్లలో సిరిసంపదలు వెల్లివిరియాలని, ప్రజలంతా ఆయురారోగ్యాలతో సుఖసంతోషాలతో జీవించాలని అమ్మవారిని వేడుకున్నట్లు తెలిపారు. పూజల్లో గ్రామ సర్పంచి ముస్నిపెల్లి కుమార్‌గౌడ్, సోనవేణి కుమార్, శానవేని సురేష్, చింతల రవీందర్, సోమల్ల అనిల్, బేతెల్లి అవినాష్‌రెడ్డి, పూజారి శ్రీనివాస్, మాదాసు శ్రీనివాస్, పెద్ది అశోక్, దేవునూరి నాగరాజు, అచ్చునూరి వంశీ, దేవునూరి జయప్రకాష్, సాయి దేవహర్ష, దేశిని రమేష్, బల్ల మహేష్, భాస్కర్, సదానందం, కుమార్, జలేందర్, మహిళలు, చిన్నారులు పాల్గొన్నారు.

రైతాంగ ఉద్యమ నేత ఓంకార్‌కు ఘన నివాళి



అక్షరశక్తి, వరంగల్: తెలంగాణ రైతాంగ ఉద్యమ నేత మద్ది కాయల ఓంకార్ 18వ వర్ధంతిని పురస్కరించుకుని తెలంగాణ రైతు సంఘం వరంగల్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో అబ్బనికుంటలోని తెలంగాణ రైతు భవన్‌లో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సంఘం రాష్ట్ర కన్వీనర్ సోమిడి శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి ఓదెల రాజయ్య నివాళులర్పించారు. ఈ సందర్భంగా సోమిడి శ్రీనివాస్ మాట్లాడుతూ.. ఉమ్మడి వరంగల్ జిల్లాలో రైతాంగ ఉద్యమాలను నిర్మించి, వేల ఎకరాల పోడు భూములను రైతులకు పంచి సాగులోకి తీసుకొచ్చిన నాయకుడు ఓంకార్ అని కొనియాడారు. ఆయన పోరాట స్ఫూర్తితోనే నేటికీ రైతాంగ ఉద్యమాలు కొనసాగుతున్నాయని తెలిపారు. రైతుల సమస్యలపై నిరంతరం కార్యక్రమాలు నిర్వహిస్తూ వారి ఐక్యతకు కృషి చేస్తున్నామని పేర్కొన్నారు. కార్యక్రమంలో సంఘం కోశాధికారి సిర్ల రవీందర్, ఉపాధ్యక్షుడు ఊరటి హంసల్‌రెడ్డి, జిల్లా కమిటీ సభ్యులు మోకిడి పీరయ్య, సోమిడి సాంబయ్య, బి.రవీందర్, పి.పైడి తదితరులు పాల్గొన్నారు.

టీజేఎస్ జిల్లా అధ్యక్షుడిగా ఆరుద్ర పరమాత్మ చారి

అక్షరశక్తి, మహబూబాబాద్ : మహబూబాబాద్ జిల్లా తెలంగాణ జనసమితి పార్టీ అధ్యక్షులుగా జిల్లా కేంద్రానికి చెందిన తెలంగాణ ఉద్యమకారుడు, ట్రస్మా పూర్వపు జిల్లా అధ్యక్షులు, ఆరుద్ర పరమాత్మ చారిని జిల్లా కార్యవర్గ తీర్మానం మేరకు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ డోలి సత్యనారాయణ సూచనమేరకు టీజేఎస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు ఎమ్మెల్సీ ప్రొ. కోదండరాం ప్రకటించారు. ఈ సందర్భంగా జిల్లా కేంద్రంలో జరిగిన పార్టీ సమావేశంలో ఈమేరకు నియామకపత్రాన్ని అందించారు. ఆరుద్ర పరమాత్మ చారి 30 ఏళ్ళు విద్యారంగంలో విశిష్ట సేవలందించి, అనేక పోరాటాలలో పాల్గొన్నారు. టీజేఎస్‌లో పార్లమెంట్ ఇన్చార్జీగా ఉన్నారు. ఈ జిల్లా అధ్యక్ష పదవి మరింత భాధ్యతలను పెంచిందని ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్ళి పరిష్కారం కోసం కృషి చేస్తానని పరమాత్మ చారి అన్నారు. తనకు ఈ బాధ్యతలు అందించిన కోదండరాం, డాక్టర్ డోలి సత్యనారాయణ, పిల్లి సుధాకర్, అంబటి శ్రీనివాస్, బైరి రమేష్‌లకు కృతజ్ఞతలు తెలిపారు.



పంటల విధ్వంసాన్ని ఆపాలి

నష్టపరిహారం చెల్లించాకే భూములు స్వాధీనం చేసుకోవాలి



అక్షరశక్తి, వరంగల్: నాగ్‌పూర్ నుంచి విజయవాడ వరకు నిర్మించతలపెట్టిన నాలుగు వరుసల గ్రీన్‌ఫీల్డ్ హైవే కోసం రైతుల పంటలను ధ్వంసం చేయడం దుర్మార్గమని అఖిల భారత రైతు కూలీ సంఘం (ఏఐకేఎంఎస్) ఉమ్మడి వరంగల్ జిల్లా ప్రధాన కార్యదర్శి రాచర్ల బాలరాజు, తెలంగాణ రైతు సంఘం ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షుడు సోమిడి శ్రీనివాస్ అన్నారు. గీసుకొండ మండలం గంగాదేవిపల్లి శివారులో పంట నష్టపోతున్న రైతుల భూములను వారు సందర్శించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. వరంగల్-నర్సంపేట ప్రధాన రహదారిని ఆనుకుని ఉన్న గంగాదేవిపల్లి శివారు ప్రాంతంలో రైతులకు ఎలాంటి నోటీసులు ఇవ్వకుండా పంటలను ధ్వంసం చేసేందుకు జాతీయ రహదారులు, రెవెన్యూ అధికారులు ప్రయత్నించడం సరికాదన్నారు. భూసేకరణ చట్టం-2013 ప్రకారం రైతులకు న్యాయమైన పరిహారం చెల్లించిన తర్వాతే భూములను స్వాధీనం చేసుకోవాలని డిమాండ్ చేశారు. గ్రామాల వారీగా వేర్వేరు పరిహారాలు నిర్ణయించడం చట్టవిరుద్ధమని ఆరోపించారు. ఎల్‌నినో ప్రభావంతో ఈ ఖరీఫ్‌లో పంట దిగుబడులు అంతంతమాత్రంగానే ఉన్నాయని, రైతులు పత్తి, మొక్కజొన్న, కూరగాయలు సాగు చేశారని తెలిపారు. మార్కెట్‌లో పంటలకు డిమాండ్ ఉన్న సమయంలో వాటిని ధ్వంసం చేయడం వల్ల రైతులు తీవ్రంగా నష్టపోతారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎకరానికి రూ.60 వేల నుంచి రూ.80 వేల వరకు పంట నష్టపరిహారం ఇస్తామని అధికారులు ప్రకటించినప్పటికీ, ఆశించిన దిగుబడి వస్తే ఎకరానికి రూ.1.30 లక్షల వరకు ఆదాయం లభించే అవకాశం ఉందన్నారు. ఖరీఫ్ పంటలు పూర్తయ్యే వరకు రైతుల భూములను స్వాధీనం చేసుకోవద్దని, జిల్లా కలెక్టర్ జోక్యం చేసుకుని బాధితులకు న్యాయం చేయాలని కోరారు. పర్యటనలో సోమిడి సాంబయ్య, సిర్ర రవీందర్, బాధిత రైతులు పెండ్లి చిన్న మల్లారెడ్డి, పెండ్లి సరోజన, రమేష్, ఎరుకల రమేష్, ప్రవీణ్, విమల తదితరులు పాల్గొన్నారు.

షార్లెట్‌లో తెలుగు సంబురాలు.. మిషిగన్‌లో నాట్స్ చాప్టర్ ప్రారంభం



అక్షరశక్తి, అమెరికా: అమెరికాలోని షార్లెట్‌లో నిర్వహించిన 'షార్లెట్ తెలుగు సంబరాలు-2026' వేడుకలు ఘనంగా జరిగాయి. చిన్నారులు, యువత ప్రదర్శించిన శాస్త్రీయ సంగీతం, నృత్యాలు, సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. తొమ్మిది శాస్త్రీయ అంశాలతో నిర్వహించిన సైన్స్ ఫెస్ట్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. తానా, జీటీఏ, ఆప్టా తదితర తెలుగు సంస్థలు భాగస్వాములయ్యాయి. నాట్స్ అధ్యక్షుడు రాజ్ అల్లాడా హాజరయ్యారు. ఈ సందర్భంగా 800 కొత్త రిజిస్ట్రేషన్లు నమోదైనట్లు నిర్వాహకులు తెలిపారు. మరోవైపు, తెలుగు సంస్కృతి పరిరక్షణ, సామాజిక సేవల విస్తరణ లక్ష్యంగా నార్త్ అమెరికన్ తెలుగు సొసైటీ (నాట్స్) మిషిగన్ చాప్టర్‌ను ఫార్మింగ్టన్ హిల్స్‌లో ప్రారంభించారు. చాప్టర్ కోఆర్డినేటర్‌గా శ్రీదేవి మణిపల్లి, జాయింట్ కోఆర్డినేటర్‌గా మహి బొల్లవరం నియమితులయ్యారు. రవి చాలంటి, హేమ సూరపరాజు, జ్యోతి జవ్వాది, అనుపమ దివాకర్లకు వివిధ బాధ్యతలు అప్పగించారు. నాట్స్ చైర్మన్ కిషోర్ కంచర్ల, అధ్యక్షుడు రాజ్ అల్లాడా మాట్లాడుతూ తెలుగు సమాజానికి సేవలందించడమే సంస్థ ప్రధాన లక్ష్యమన్నారు. ఈ సందర్భంగా మనోరమ గాంధీ, సంధ్య శ్రీ ఆత్మకూరి, మనబడి, సన్నీ రెడ్డి, డాక్టర్ హరినాథ్ పోలిచెర్లను సత్కరించారు. విద్యార్థుల కూచిపూడి ప్రదర్శనలు అలరించాయి. మహిళా సాధికారత, యువ నాయకత్వం, తెలుగు భాషా సంస్కృతుల పరిరక్షణకు ప్రతి మూడు నెలలకు ఒక ప్రధాన సేవా కార్యక్రమం నిర్వహించాలని నిర్ణయించారు. వివిధ తెలుగు సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు. పీఆర్వో జీకే మీడియా గణేష్ కుమార్.

ప్రమాదం నుంచి పాఠం..
సమస్యపై పోరాటం!

- **మాంజా తీగ తగిలి తృటిలో తప్పిన ప్రమాదం**
- **వెంటనే హన్మకొండ జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు**
- **నిర్లక్ష్యంగా వదిలేయకుండా సమస్య పరిష్కారానికి చొరవ చూపిన 16 ఏళ్ల చార్వాక**



అక్షరశక్తి, హనుమకొండ: మన కళ్లముందు తప్పు జరిగినప్పుడు కొందరు మనకెందుకులే అని మౌనంగా వెళ్లిపోతారు. మరికొందరు ప్రశ్నించే ధైర్యం లేక దారి మళ్లిస్తారు. కానీ ఇంకొందరు మాత్రం సమస్యను గుర్తించి, దాని పరిష్కారం కోసం అడుగు ముందుకేస్తారు. అలాంటి ఆలోచనతోనే వ్యవహరించాడు 16 ఏళ్ల ఇంటర్మీడియట్ విద్యార్థి చార్వాక. మాంజా తీగ కారణంగా తృటిలో ప్రమాదం నుంచి బయటపడిన అతడు.. తనకు ఎదురైన అనుభవాన్ని వ్యక్తిగత ఘటనగా వదిలేయకుండా, ఇతరులకు ప్రమాదం జరగకుండా చర్యలు తీసుకోవాలని భావించాడు. వెంటనే హనుమకొండ జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేసి సమస్యను అధికారుల దృష్టికి తీసుకెళ్లాడు.

తనకు ఎదురైన ప్రమాదం..
మరొకరికి జరగకూడదని!

గ్రేటర్ వరంగల్ పరిధిలోని కాజీపేట-వడ్డేపల్లి రోడ్డులో జిల్లా రిజిస్ట్రేషన్ కార్యాలయం రోడ్డు మీదుగా వెళ్తున్న సమయంలో చార్వాకకు మాంజా తీగ తగిలింది. దీంతో అతడు తృటిలో ప్రమాదం నుంచి బయటపడ్డాడు. గతంలోనూ పలు ప్రాంతాల్లో మాంజా కారణంగా ప్రమాదాలు జరిగిన విషయాలను గుర్తుచేసుకున్నాడు. తనకు ఎదురైన ఘటన మరొకరికి ఎదురుకాకూడదనే ఆలోచనతో వెంటనే స్పందించాడు. ఈ ఘటనను హనుమకొండ జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశాడు.

యువతలో సామాజిక బాధ్యతకు నిదర్శనం

ధర్మసాగర్ ఇంటర్మీడియట్ కళాశాలలో ద్వితీయ సంవత్సరం చదువుతున్న చార్వాక స్పందన నేటి యువతలో సామాజిక బాధ్యత, సమస్యల పరిష్కారంపై చొరవ ఉన్నాయని చాటుతోంది. ఒక ప్రమాదం నుంచి బయటపడిన తర్వాత భయంతోనో, నిర్లక్ష్యంతోనో ఆ విషయాన్ని మరిచిపోకుండా.. ప్రజలకు ప్రమాదకరంగా మారే అంశంపై అధికారులకు ఫిర్యాదు చేయడం అభినందనీయం. సమాజంలో మార్పు రావాలంటే తప్పులను గుర్తించడం మాత్రమే కాదు.. వాటిని సరిదిద్దేందుకు బాధ్యతగా ముందుకు రావాలనే సందేశాన్ని ఈ విద్యార్థి తన చర్యతో అందించాడు. చిన్న వయసులోనే సమస్యను గుర్తించి, పరిష్కారం కోసం అధికారులను ఆశ్రయించిన చార్వాక ఆలోచన ఇతర యువతకూ స్ఫూర్తిదాయకం. మనకు ఎదురైన సమస్య మరొకరికి ఎదురుకాకుండా చూడాలనే ఆలోచనే నిజమైన సామాజిక బాధ్యతకు తొలి అడుగు.

బీసీ హక్కుల సాధన సమితి జిల్లా కమిటీ ఎన్నిక



అధ్యక్షుడిగా చెలుకల రాజు

అక్షరశక్తి, వరంగల్: బీసీ హక్కుల సాధన సమితి వరంగల్ జిల్లా రెండో మహాసభల అనంతరం నూతన జిల్లా కమిటీని ఎన్నుకున్నారు. అక్టోబరు 16న నిర్వహించిన మహాసభల్లో ఎంపిక చేసిన 65 మందితో జిల్లా కమిటీని ఏర్పాటు చేసినట్లు సమితి రాష్ట్ర అధ్యక్షుడు తాటిపాముల వెంకట్రాములు ప్రకటించారు. అధ్యక్షుడిగా చెలుకల రాజు, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా గజవెల్లి అనుప్రసాద్, ప్రధాన కార్యదర్శిగా చింతకింది కుమారస్వామి, కోశాధికారిగా చిట్యాల సువర్ణ ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షులుగా బైరి తిరుపతి, రావుల అనిల్‌కుమార్, ఆరెల్లి ప్రభాకర్, కడియాల మనోహర్, దేశబోయిన ఉపేందర్, బండ్లోజు నరసింహాచారి, నల్ల తీగల కుమార్, మునిగాల సత్యనారాయణ, ఏనుగు శైలజ, పరికరాల రమేష్, అల్లాడి నరసయ్య, సల్లూరి నరేందర్, పాము మనోహర్, ఎం.డి.జాఫర్, మచ్చ రమేష్, గొల్లపల్లి సదాశ్రీను, పుల్లూరి కుమారస్వామి, జున్ను మణెమ్మ ఎన్నికయ్యారు.

సహాయ కార్యదర్శులుగా చీకటి ప్రకాష్, బొట్ల శ్రీనివాస్, మచ్చ కుమారస్వామి, పుల్ల ఎల్లగౌడ్, పేరువారం రవీందర్, జున్నరాజు, జున్న సాంబయ్య, కుల్లా రాకేష్, మల్యాల దేవేందర్, ఆకోజు సాంబయ్య, తంగళ్లపల్లి విజయలక్ష్మి, ఆరెల్లి కళ్యాణి, సుతారి శ్రీధర్, వీరమల్ల రాములు, గొల్లపల్లి యాదగిరి, పెద్దోజు వీరబ్రహ్మం, బుర్ర రామ్మూర్తి, పెద్దూరి నాగరాజు, బక్కం రాజు ఎన్నికయ్యారు. సోషల్ మీడియా కన్వీనర్‌గా మచ్చ రమేష్, అధికార ప్రతినిధులుగా మెరుగు రంజిత్‌గౌడ్, ఆరె రాజు ఎన్నికయ్యారు. కార్యవర్గ సభ్యులుగా శాస్త్రబోయిన యాకయ్య, గోదారి రాములు, గద్దం నరసింహారావు, మౌటం కుమారస్వామి, కడియాల క్రాంతికుమార్, రజని, ఉదయశ్రీ, శైలజ, చిందం స్వరూప, పుల్లా కల్పన, గజ్జి రాజేశ్వరి, దేశబోయిన స్వాతి, ఇటుకాలపల్లి విజేత, పర్వతగిరి ప్రేమ్‌కుమార్, మోదం రమేష్, మేర్గు రాజు, ఎం.డి.షాపొద్దిన్, ఎం.డి.యాకూబ్‌పాషా, నానబోయిన మొగిలి, బా శెట్టి రంజిత్, పెరుమాండ్ల రమేష్, చలమల్ల శివశంకర్, బాతు వెంకన్న, గజ్జల సోమ నరసయ్య, ఇట్టబోయిన సోమయ్య, మండల యాకయ్య, మామిండ్ల చెన్నమల్లు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

GUEST COLUMN

నిరసనను అణచగలరు.. అసమ్మతిని కాదు!

ప్రజాస్వామ్యంలో ప్రభుత్వ బలాన్ని కొలవడానికి ఎన్నికల్లో సాధించిన విజయాలే గీటురాళ్ళు కావు. తనను ప్రశ్నించే పౌరుడి గొంతును ఎంతవరకు గౌరవిస్తోంది, విమర్శను ఎంతవరకు సహిస్తోంది, అధికార దుర్వినియోగంపై ఎంతవరకు జవాబుదారీగా ఉంటోంది అన్నవే అసలైన కొలమానాలు. ఈ పరీక్షలో నరేంద్ర మోదీ ప్రభుత్వం ఎదుర్కొంటున్న సవాలు రోజురోజుకూ తీవ్రమవుతోంది. గుజరాత్‌లో రాజకీయ అసమ్మతిని నియంత్రించడానికి, క్రూరంగా అణచివేయడానికి ఉపయోగించిన పద్ధతులనే దేశమంతటా ప్రయోగిస్తే ఫలితం సాధించవచ్చని భావించడం రాజకీయ మూర్ఖత్వం తప్ప మరొకటి కాదు.బీజేపీ ప్రభుత్వం వాస్తవాలను తప్పగా అంచనా వేస్తోంది.



- డాక్టర్.కోలాహలం రామ్ కిశోర్.
9849328496
ramkishore.1504@gmail.com

దీనికి తాజా ఉదాహరణ కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) యువత చేపట్టిన నిరసనలు. ఒకప్పుడు సామాజిక మాధ్యమాల్లో వ్యంగ్యంతో ప్రారంభమైన ఈ ఉద్యమం, ఇప్పుడు ఎన్నికల సంఘం నిష్పాక్షికత, నిరుద్యోగం, పరీక్షల నిర్వహణలో అవకతవకలు, ప్రభుత్వ జవాబుదారీతనం వంటి అంశాలను ముందుకు తెస్తోంది. ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని, ఓటర్ల జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణ (సర్) పై తలెత్తిన అనుమానాలకు సమాధానాలు చెప్పాలని ఉద్యమకారులు డిమాండ్ చేస్తున్నారు. ఓటర్ల జాబితాల నుంచి సుమారు 13 కోట్ల పేర్లు తొలగించారన్నది ఉద్యమకారులు, విమర్శకులు ముందుకు తెచ్చిన తీవ్రమైన ఆరోపణ. ఈ సంఖ్య, తొలగింపుల కారణాలు, వాటి ప్రభావం స్వతంత్రంగా పరిశీలించాల్సిన అంశాలు. ఈ ఆరోపణలను నిర్ధారిత వాస్తవాలుగా కనిపిస్తున్నా, నిర్లక్ష్యం చేస్తూ వాటిపై పారదర్శకమైన సమాధానాలు ఇవ్వకుండా తమ గోదీ మీడియా, వాట్సాప్ యూనివర్సిటీ, సోషల్ మీడియా ద్వారా కొట్టిపారేయడం కూడా అంతే తప్పు.అవి ఇప్పటికే ప్రజా విశ్వాసాన్ని కోల్పోయాయి.

అక్టోబరు 16న ఢిల్లీలోని కన్నాట్ ప్లేస్ సెంట్రల్ పార్కులో నిర్వహించ తలపెట్టిన 'లెహా దో తిరంగా' ప్రదర్శనకు ముందు సీజేపీ వ్యవస్థాపకుడు అభిజీత్ దీపేను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. విద్యార్థి నాయకురాలు నేహా బోరాను కూడా నిర్బంధించారు. సెంట్రల్ పార్కును రెండు రోజులపాటు మూసివేయడం, భారీ పోలీసు బందోబస్తు, నిరసనకారులపై నిర్బంధ చర్యల మధ్య కూడా ప్రజలు జాతీయ జెండాలతో వేలాది మంది వీధుల్లోకి వచ్చారు. తమ నిరసనను ముందుగానే నిర్వీర్యం చేయాలన్న కేంద్ర ప్రభుత్వ ప్రయత్నం ప్రజల రాజకీయ స్పందనను పూర్తిగా ఆపలేకపోయిందన్నది స్పష్టం. ఢిల్లీ పరిణామాలను అంతర్జాతీయ వార్తా సంస్థ అసోసియేటెడ్ ప్రెస్ కూడా మోదీ ప్రభుత్వాన్ని తప్పు పడుతూ ప్రధానంగా నివేదించింది. ది గార్డియన్ అక్టోబరు 16న ఈ ఉద్యమ నాయకుడి నిర్బంధాన్ని, మోదీ ప్రభుత్వంపై పెరుగుతున్న విమర్శలను కూడా ప్రస్తావించింది. ఇవి కేవలం ఒక చిన్న రాజకీయ బృందానికి సంబంధించిన వార్తలు కావు; భారత ప్రజాస్వామ్యంలో నిరసన హక్కుకు ఎదురవుతున్న సవాళ్లపై అంతర్జాతీయ దృష్టి ఉందనడానికి నిదర్శనాలు. (అసోసియేటెడ్ ప్రెస్, అక్టోబరు 16; ది గార్డియన్, అక్టోబరు 16.)

జంతర్ మంతర్‌ను నిరసన ప్రదర్శనలకు అనుమతించే అధికారిక ప్రదేశాల జాబితా నుంచి తొలగించటం బీజేపీ ప్రభుత్వం తీసుకున్న పెద్ద పొరపాటు నిర్ణయం, ప్రత్యామ్నాయ ప్రదేశాల వైపు ఆందోళనకారులను మళ్ళించడం కూడా ఈ పరిణామాల్లో ముఖ్యమైన అంశం. నిరసనలకు అనుమతి ఇవ్వాలా వద్దా అన్నది శాంతిభద్రతల పరిరక్షణతో సంబంధం ఉన్న పరిపాలనా నిర్ణయమే కావచ్చు. కానీ నిరసన ప్రదేశాలను మార్చడం, నాయకులను ముందుగానే నిర్బంధించడం, ఉద్యానవనాలను మూసివేయడం, రహదారులపై కఠిన ఆంక్షలు విధించడం ఒకే దిశలో మూర్ఖంగా సాగితే, ప్రజాస్వామ్య హక్కులను పరిమితం చేస్తున్నారనే అనుమానం బలపడుతుంది. నిషేధాజ్ఞలు విధించడానికి చట్టపరమైన ఆధారాలు ఉండవచ్చు. అయితే వాటి వినియోగం అవసరమైనదా, సముచితమైనదా, అనుపాతంలో ఉందా అన్నది కూడా ప్రశ్నించాలి.

భారత రాజ్యాంగంలోని 19వ అధికరణం పౌరులకు భావప్రకటన స్వేచ్ఛను, శాంతియుతంగా నిరాయుధులుగా సమావేశమయ్యే హక్కును కల్పిస్తుంది. చట్టబద్ధమైన పరిమితులు ఉండవచ్చు. అంత మాత్రాన ప్రభుత్వాన్ని విమర్శించడం, ఎన్నికల కమిషనర్ రాజీనామా కోరడం, జాతీయ జెండాతో శాంతియుతంగా నిరసన తెలపడాన్ని నేరంగా పరిగణించలేం. నిరసనకారులు చట్టాన్ని ఉల్లంఘించినట్లు ఆరోపణలుంటే వాటిని నిర్దిష్ట ఆధారాలతో కేసులు పెట్టి కోర్టుల ద్వారా విచారణ జరిపించాలి. కానీ కొందరు ఎవరో ఒకరు చట్టం ఉల్లంఘనలకు పాల్పడ్డారనే కారణంతో మొత్తం ఉద్యమాన్ని అనుమానాస్పదంగా చిత్రించడం, శాంతి యుతంగా నిరసనలు తెలిపే నాయకులను, యువతీ, యువకులను అందరినీ అమానుషంగా, పోలీసులు, సరిహద్దు దేశాలు, బీజేపీ, ఆరెస్సెస్ రౌడీ మూకల హింసాయుత దాడులు చేయటం. పోలీసులతో నిర్బంధించడం, బస్సుల్లో కుక్కటం, హింసాయుత చర్యలు తీసుకోవటం ప్రజాస్వామ్య పాలనకు తగిన పద్ధతి కాదు.

2015లో హార్దిక్ పటేల్ నేతృత్వంలోని పటిదార్ ఉద్యమం బీజేపీ ప్రభుత్వాన్ని తీవ్ర ఒత్తిడికి గురిచేసింది. ఆ ఉద్యమం రాష్ట్ర రాజకీయాలపై ప్రభావం చూపింది. అనంతరం హార్దిక్ పటేల్ బీజేపీలో చేరి ఎమ్మెల్యే అయ్యారు. ఒకప్పుడు అధికారాన్ని సవాలు చేసిన నాయకుడు చివరకు అదే వ్యవస్థలో భాగమయ్యాడు. ఒక ఉద్యమ నాయకుడిని రాజకీయ వ్యవస్థలోకి చేర్చుకోవడం ద్వారా అతను ప్రాతినిధ్యం వహించిన అసంతృప్తి మొత్తం తొలగిపోయిందని భావించడం పొరపాటు. వ్యక్తిని ఆకర్షించవచ్చు, పదవితో సంతృప్తిపరచవచ్చు, కేసులతో బెదిరింపులకు గురి చేసి భయపెట్టవచ్చు. కానీ నిరుద్యోగం, పరీక్షల లీకేజీలు, ఎన్నికల పారదర్శకతపై ప్రజల్లో ఉన్న ఆందోళనలను అలా తొలగించలేరు.

సీజేపీ ఉద్యమానికి ప్రత్యేకత ఇదే. సంప్రదాయ రాజకీయ పార్టీల మాదిరిగా పదవులు, ఎన్నికల పొత్తులు, నాయకత్వ వారసత్వాల చుట్టూ మాత్రమే దాని కార్యకలాపాలు తిరగడం లేదు. సామాజిక మాధ్యమాల ద్వారా అభిప్రాయాలు ఏర్పరచుకునే, అధికారిక ప్రచారాన్ని ప్రశ్నించే, తమ భవిష్యత్తుపై ఆందోళనను రాజకీయ నిరసనగా మార్చుకునే యువత ఇందులో కనిపిస్తోంది. ఉద్యమం ఎంతకాలం నిలబడుతుంది, దేశవ్యాప్తంగా స్థిరమైన రాజకీయ శక్తిగా ఎదుగుతుందా లేదా అన్నది ఇప్పుడే తేల్చలేం. అయినప్పటికీ దాన్ని హాస్యాస్పదమైన పేరుతో కొట్టిపారేయడం లేదా కొందరు నాయకులను నిర్బంధిస్తే అంతా ముగిసిపోతుందని అనుకోవడం పాలకుల అహంకారానికి నిదర్శనం.

పరీక్షల నిర్వహణపై వివాదాల నేపథ్యంలో విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాల్సి వచ్చిన పరిణామాన్ని కూడా ఈ నేపథ్యంలో చూడాలి. యువత అసంతృప్తి కేవలం సామాజిక మాధ్యమాల చర్చకే పరిమితం కాలేదని, పాలనా నిర్ణయాలపై ఒత్తిడి సృష్టించగలదని అది సూచించింది. అయితే ఒక మంత్రి రాజీనామా చేయడం మాత్రమే సమస్యకు పరిష్కారం కాదు. పరీక్షల నిర్వహణలో పారదర్శకత, ప్రశ్నపత్రాల భద్రత, నియామకాల్లో సమయపాలన, నిరుద్యోగులకు సమాన అవకాశాలు కల్పించడం వంటి మౌలిక మార్పులు అవసరం. వ్యవస్థలోని లోపాలను సరిదిద్దకుండా విమర్శకులనే సమస్యగా చూపించడం వ్యాధికి చికిత్స చేయకుండా జ్వరాన్ని కొలిచే పరికరాన్ని పగులగొట్టడంతో సమానం.

ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్యమని చెప్పుకునే భారతదేశానికి ఎన్నికలు నిర్వహించడం మాత్రమే సరిపోదు. ఓటరు తన ఓటు విలువపై విశ్వాసం కలిగి ఉండాలి. ఎన్నికల సంఘం పాలకపక్షానికి అనుకూలంగా పనిచేస్తోందనే అనుమానాలు తలెత్తినప్పుడు, వాటిని నివృత్తి చేయడానికి అవసరమైన సమాచారం అందుబాటులో ఉండాలి. ఓటర్ల జాబితాల్లో తొలగింపులు జరిగితే వాటి కారణాలు, పునఃపరిశీలనకు మార్గాలు, అప్పీలు చేసుకునే అవకాశాలు స్పష్టంగా ఉండాలి. ఎన్నికల సంఘం స్వతంత్రతపై ప్రశ్నలు వచ్చినప్పుడు విమర్శకులను శత్రువులుగా చూడకుండా, సంస్థ విశ్వసనీయతను కాపాడే విధంగా సమాధానాలు ఇవ్వాలి. అదే ప్రజాస్వామ్య సంస్థాగత బాధ్యత.

ఇదంతా రాజకీయ స్వేచ్ఛకు సంబంధించిన సమస్య మాత్రమే కాదు. ఉద్యోగాల కోసం ఎదురు చూస్తున్న యువత, పోటీ పరీక్షలకు సంవత్సరాల తరబడి సిద్ధమవుతున్న విద్యార్థులు, పెరుగుతున్న జీవన వ్యయాలతో ఇబ్బందిపడుతున్న కుటుంబాలు తమ భవిష్యత్తుపై భరోసా కోరుతున్నాయి. ఆర్థిక వృద్ధి రేటు పెరిగిందనే ప్రకటనతో ప్రతి యువకుడికి ఉద్యోగం లభించదు. దేశం అభివృద్ధి చెందుతోందనే ప్రచారంతో పరీక్షల వ్యవస్థలోని లోపాలు మాయమవవు. అధికారిక గణాంకాల్లో వృద్ధి కనిపించినా, ఆ వృద్ధి అవకాశాలుగా, ఆదాయాలుగా, న్యాయమైన పోటీగా ప్రజలకు అందకపోతే అసంతృప్తి పెరుగుతుంది. ఆ అసంతృప్తి రాజకీయ రూపం దాల్చినప్పుడు దాన్ని పోలీసు బలంతో మాత్రమే ఎదుర్కోవడం సాధ్యం కాదు.

మోదీ ప్రభుత్వం, బీజేపీ, ఆరెస్సెస్ భావజాలం ప్రజా అసమ్మతిని రాజకీయ ప్రత్యర్థుల కుట్రగా మాత్రమే చూడటం మానుకోవాలి. జాతీయ జెండాపై తమకే గుత్తాధిపత్యం ఉన్నట్లు వ్యవహరించే హక్కు ఎవరికీ లేదు. దేశభక్తి అంటే ప్రభుత్వాన్ని ప్రశ్నించకుండా ఉండటం కాదు; దేశ ప్రజల హక్కులు, రాజ్యాంగ విలువలు, ప్రజాస్వామ్య సంస్థలను కాపాడాలని పట్టుబట్టడం కూడా దేశభక్తే. దేశ, విదేశాల్లో ఉన్న ప్రముఖులు సల్మాన్ రష్దీ, మీరా నాయర్ వంటి ప్రముఖులు లాయర్లు,మాజీ న్యాయమూర్తులు , మాజీ ఎన్నికల కమిషనర్లు, డాక్టర్లు, రచయితలు, మేధావులు, సంపాదకులు, జర్నలిస్టు ప్రముఖులు, యూనివర్సిటీ ప్రొఫెసర్లు మొదలైన వారు అందరూ యువత నిరసనలకు తమ మద్దతు తెలిపిన వార్తలు ఈ ఉద్యమానికి అంతర్జాతీయ సాంస్కృతిక వర్గాల్లోనూ స్పందన లభిస్తున్నదని సూచిస్తున్నాయి. కానీ యువత గొంతును వినాలనే అవసరాన్ని ముందుకు తెస్తుంది.

బీజేపీ ప్రభుత్వం ప్రతి ప్రజా నిరసనను అణచివేయాలనే పట్టుదల ప్రజాస్వామ్యానికి ప్రమాదకరం. శాంతిభద్రతలను కాపాడటం ప్రభుత్వ బాధ్యతే; అదే సమయంలో శాంతియుత అసమ్మతిని రక్షించడం కూడా దాని రాజ్యాంగ బాధ్యత. పోలీసు నిర్బంధం తాత్కాలికంగా రహదారులను ఖాళీ చేయించవచ్చు. పార్కులకు తాళాలు వేయవచ్చు. నిరసన నాయకులను జైళ్లకు పంపవచ్చు. కానీ ప్రజల మనసుల్లో పెరుగుతున్న అనుమానాలకు సమాధానం చెప్పలేవు.

భారతదేశం గుజరాత్ కాదు. ఇక్కడ భాషలు, మతాలు, ప్రాంతాలు, సామాజిక వర్గాలు, రాజకీయ అభిప్రాయాలు విభిన్నమైనవి. ఒకే నాయకుడి ప్రచారం, ఒకే పార్టీ యంత్రాంగం, ఒకే నిర్బంధ పద్ధతి దేశమంతటా ప్రజల ఆలోచనలను నియంత్రించలేవు. 2027లో జరిగే ఎన్నికల ముందు ఈ నిరసనలు ప్రభుత్వానికి ఒక హెచ్చరికగా నిలుస్తున్నాయి. ఆ హెచ్చరికను వినిపించిన యువతను శత్రువులుగా చూడాలా, లేక ప్రజాస్వామ్యాన్ని సరిదిద్దుకునే అవకాశంగా భావించాలా అన్నది పాలకుల ముందున్న నిర్ణయం.

ప్రజా ఉద్యమాలను అణచివేయడం ద్వారా ప్రభుత్వం తన బలాన్ని నిరూపించుకున్నట్లు కనిపించవచ్చు. కానీ ప్రజల ప్రశ్నలకు సమాధానం చెప్పలేని అధికారం తన బలహీనతనే బయటపెడుతుంది. జాతీయ జెండాను పట్టుకున్న యువతీ, యువకుల చేతిని ఆపటం అవివేకం; ఆ చేతులు ఎందుకు తమ పిడికిళ్ళను బిగించిందో కేంద్ర ప్రభుత్వం అర్థం చేసుకోవాలి. నిరసన ప్రదేశాన్ని మార్చవచ్చు; ప్రజల ఆవేదనకు చిరునామా మార్చలేరు. ప్రజాస్వామ్యంలో అంతిమ అధికారం ప్రజలదే. దాన్ని గుర్తించని పాలకులకు చరిత్ర ఇచ్చే తీర్పు పోలీసు బలగాల సంఖ్యను బట్టి కాదు, ప్రజల విశ్వాసాన్ని ఎంతగా కోల్పోయారన్నదాన్ని బట్టి ఉంటుంది.

Printer, Publisher by Palle Ravi Vamshi Mohan on behalf M/s Creative Media Group by Printed at Ramani Web Offset Printers H.No. 8-82/11/1, Autonagar, Bommakal Village, Mdl&Dist: Karimnagar-505001. T.S. Published at H.No. 2-1-14, Saraswathi Nagar, Vidyaranyapuri, Mdl: Hanamkonda, Dist: Warangal-506009. T.S. Editor: Dr PR Vamshimohan.